# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 242 | విశాఖపట్నం | 2-6-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 242 | VISAKHAPATNAM | 2-6-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | PhonePe


## దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

# చేస్తున్నాం: చంద్రబాబు

**తుని, పతాకం న్యూస్:** 'గతంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే వెంటనే రద్దు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల వరకు ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కుటుంబానికి దాదాపు 3, 4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. మహిళలకు 33% సీట్లు, ఉచితంగా 3 సిలిండర్లు: ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించి రాజకీయంగా ఎదిగేలా చేసేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర రైతుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నామని సీఎం అన్నారు. నేరుగా పేదవాడి ఇంటికి వచ్చి పింఛను ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. కేవలం ఈరోజు బాగుంటే చాలదు, భవిష్యత్ కూడా బాగుండేలా ప్రణాళికలు వేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చంద్రబాబు పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే మన వాళ్లు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని. విశాఖలో గూగుల్ సంస్థ రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రాష్ట్ర యువత నైపుణ్యాలు పెంచుకొని ఉద్యోగాలు అందుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాదని ఆయన భరోసా ఇచ్చారు. గతేడాది యోగాంధ్రను విజయవంతంగా



నిర్వహించామని తెలిపారు. ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతామని, రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు దరిచేరవన్నారు. అందరి జీవన ప్రమాణాలు పెరగాలన్నదే మా కల అని సీఎం వివరించారు. 'పింఛన్లు ఇంటింటికే వచ్చి అందిస్తున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఏ సమస్యకైనా ఆన్‌లైన్‌లోనే పరిష్కారం చూపుతున్నాం. పీ4 కార్యక్రమం కింద పేదలను (తరువాయి 2వ పేజీలో)



# ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం!

## రసాయనాలతో పండ్లను మగ్గిస్తున్న వ్యాపారులు.. చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ చూసినా నిగనిగలాడే మామిడి పండ్లు కనిపిస్తున్నాయి. కానీ ఈ నిగనిగ వెనుక ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే ప్రమాదం పొంచి ఉంది. మామిడి కాయలను అత్యంత ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌తో పాటు ఇథిలిన్, సల్ఫర్ వంటి రసాయనాలతో మగ్గించి వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో పండ్లలో పోషకాలు తగ్గడమే కాకుండా అవి విషపూరితంగా మారుతున్నాయి. ఒక్క మామిడికే కాదు.. అరటి, సపోట, బొప్పాయి, యాపిల్, జామ.. ఇలా అన్నింటికీ రసాయనాలనే వాడుతున్నారు. చివరకు కాయలను పక్వానికి తెచ్చేందుకు సూదిమందు వాడుతుండడం విచారకరం. కృత్రిమంగా మగ్గబెట్టిన పండ్ల అమ్మకాలను అరిట్టేందుకు శ్రీకాకుళంలోని పలు మార్కెట్లు, దుకాణాలపై ఇటీవల ఆహార భద్రతాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆహార భద్రతాధికారి కె.లక్ష్మీ నేతృత్వంలో జరిగిన ఈ తనిఖీల్లో మామిడి, అరటిపండ్ల నాణ్యతను పరిశీలించి, అనుమానాస్పదంగా ఉన్న నమమూనాలను సేకరించి స్టేట్‌ఫుడ్ లేబొరేటరీకి పంపారు. ల్యాబ్ నివేదికల్లో రసాయనాల వాడకం తేలితే సదురు వ్యాపారులపై ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. జిల్లాలో శ్రీకాకుళం నగరంతోపాటు రణస్థలం, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, ఆమదాల వలసలో పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఎక్కడా సంప్రదాయ పద్ధతితో పండ్ల రకాలను మగ్గించే ప్రయత్నం చేయడం లేదు. రసాయనాలను కృత్రిమంగా వినియోగిస్తున్నారు. జిల్లాకేంద్రం శ్రీకాకుళంలో సిండికేట్‌గా ఏర్పడి వ్యాపారులు వీటిని విక్రయిస్తున్నారు. శ్రీకాకుళం డేఅండ్ నైట్ జంక్షన్, పాలిటెక్నిక్ కాలేజీ (తరువాయి 2వ పేజీలో)



2లో

### విశాఖలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయండి

ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో మంత్రి లోకేష్ భేటీ

### సెల్ఫీ మోజులో లారీని ఢీకొట్టిన స్కూటీ..

## ముగ్గురికి తీవ్ర గాయాలు



2లో



6లో

### థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి..!

## 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు: సత్యకుమార్



**అమరావతి, పతాకం న్యూస్:** ఈ ఏడాది జూన్ 7 నుంచి 21 వరకు15 రోజుల పాటు యోగా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. పొదుపు చర్యల్లో భాగంగా 30 రోజుల నుంచి 15 రోజులకు కుదించినట్లు తెలిపారు. జూన్ 21న ప్రధాన యోగా కార్యక్రమం వెస్ట్రన్ బైపాస్ రోడ్డుపై నిర్వహించాలనే దానిపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులు, బీఆర్ అంబేద్కర్ కోనసీమలో రైతులు, కృష్ణా జిల్లాలో లారీ ఓనర్ల అసోషియేషన్ ద్వారా యోగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు (తరువాయి 2వ పేజీలో)

### పాయకరావుపేట నియోజకవర్గంలో

## హోం మంత్రి అనిత పర్యటన

లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**పాయకరావుపేట, పతాకం న్యూస్:** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా సత్యవరం గ్రామానికి చేరుకున్న మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. పెన్షన్ పంపిణీ అనంతరం హోం మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సత్యవరంలోని గౌరీ పరమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాంపురం గ్రామంలో బొడ్డపాటి వీరాస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి, ఇటీవల అకాల వర్షాల కారణంగా మృతి చెందిన అరట్లకోట గ్రామానికి చెందిన ఎరకయ్య, శంకర్ కుటుంబాలను కూడా పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం (తరువాయి 2వ పేజీలో)

### వైసీపీపై మంత్రి

## అనగాని ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** నంద్యాలలో వైఎస్ విగ్రహం విధ్వంసం ఘటనపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ కార్యకర్త జంబులయ్యతో తీయించి.. దాన్ని టీడీపీ మీద నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జంబులయ్య భార్యకు మెప్మాలో గత ప్రభుత్వంలో ఉద్యోగం ఇచ్చారని... నాటి వైసీపీ ఎమ్మెల్యేనే ఆ ఉద్యోగం ఇప్పించారని తెలిపారు. మనుషుల తలకాయలే తీసిన గొడ్డలి పార్టీ నేతలకు.. విగ్రహాల తలలు తీయడం ఓ లెక్క కాదన్నారు. విగ్రహం తలకాయను (తరువాయి 4వ పేజీలో)


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## భయపడం..

కేరళంలో ప్రభుత్వం మారి దాదాపు రెండు వారాలయింది. ఈ కొద్ది రోజుల్లో కొత్త ప్రభుత్వం పనితీరును అంచనా వేయడం సాధ్యం కాదని అందరికీ తెలుసు. అయినప్పటికీ, వడస్సేరి దామోదర మీనన్ సతీషన్ ప్రభుత్వ భవిష్యత్ పనితీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడానికి స్పష్టమైన సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయి. వాటిని ఈ కింది విధంగా సంగ్రహించవచ్చు. అన్నిటికన్నా ముందుగా, రాష్ట్రంలో ఆకలితో అలమటిస్తున్న పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. అలాగే, ఎన్నికల కాలమంతా బిజెపితో సిపిఐ(ఎం) ఒప్పందం చేసుకుందని ఆరోపించిన కాంగ్రెస్ నాయకత్వం, వాస్తవానికి తానే బిజెపితో ఒక ఒప్పందానికి వచ్చిందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. బుధవారం సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్‌కు చెందిన కన్నూర్‌లోని ఇంటిపైన, తిరువనంతపురంలోని ఆయన అద్దె ఇంటిపైన, కొజికోడ్‌లోని మాజీ మంత్రి మహమ్మద్ రియాజ్ ఇంటిపైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇ.డి) జరిపిన దాడులు ఈ అపవిత్ర పొత్తులో భాగమే. అంతకుముందు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాలపై ఇ.డి జరిపిన దాడులకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మద్దతు తెలిపాయి. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ ప్రసంగిస్తూ , కేజ్రీవాల్, శిబు సోరెన్‌ల మాదిరే పినరయి విజయన్‌ను ఇ.డి ఎందుకు ప్రశ్నించదు, జైలులో పెట్టదు అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులను తప్పుడు కేసులలో ఇరికించడానికి, ప్రతిపక్ష రహిత భారత్ లక్ష్యంగా మోడీ ప్రభుత్వం సాగిస్తున్న కుట్రలు కుతంత్రాల్లో ఇ.డి ని ఒక అస్త్రంగా వాడుకుంటోంది. ఈ తప్పుడు చర్యను కాంగ్రెస్ నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తోంది. అందుకే, మొన్న జరిగిన సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశం ఇతర ప్రతిపక్ష పార్టీల పట్ల కాంగ్రెస్ చూపుతున్న శత్రు వైఖరి ప్రతిపక్ష ఐక్యతకు ఆటంకం కలిగిస్తోందన్న అంచనాకు వచ్చింది. బిజెపి నిరంకుశ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడంలో దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ సహాయపడుతున్నప్పుడు, అది కార్పొరేట్ హిందుత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలా పోరాడగలదన్న ప్రశ్నను సిపిఐ(ఎం) లేవనెత్తింది. ఎర్నాకుళం జిల్లాలోని పరియాతుకావు ఉన్నాతిలో ఎనిమిది ఎస్సీ కుటుంబాలపై పోలీసులు జరిపిన దాడి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానంలోని అసలు రంగును బయటపెట్టింది. నేను ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు, పోలీసులు పిల్లలను, మహిళలను, రోగులను, వృద్ధులను కొట్టారని అక్కడి నిరుపేదలు భోరున ఏడ్చారు. ఎ.కె.ఆంటోనీ హయాంలో ముత్తంగాలో అయిదుగురిని కాల్చి చంపిన దాడిని పరియతుకావులోని ఈ ఘటన గుర్తుచేస్తోంది. దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించకుండా అక్కడ నుండి వెళ్లగొట్టాలని కొత్త ప్రభుత్వం చూస్తోంది. దీనిని బట్టి వారు ఎవరికి సేవ చేస్తున్నారో స్పష్టం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో పేదలకు అండగా సిపిఐ(ఎం), ప్రజలు ముందుకొచ్చారు. నిబంధనల ప్రకారం భూమిని కొలవడం, సరిహద్దులను నిర్ధారించడం, వారికి హక్కు పత్రాలు ఇవ్వడం వంటి సర్వే ప్రక్రియ ప్రారంభమైన సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. దీంతో, కొత్త ప్రభుత్వం ఈ నిరుపేదలను విస్మరించడమే కాకుండా, వారిని దారుణంగా కొట్టింది. దీని ద్వారా యుడిఎఫ్ ప్రభుత్వం పేద, భూమి లేని ప్రజలతో కాకుండా, భూ మాఫియా, ధనవంతుల పక్షాన ఉంటుందనే సందేశాన్ని ఇచ్చినట్టైంది.'లైఫ్' ప్రాజెక్టు ఉసురు తీయాలన్న నిర్ణయాన్ని ఈ విధానానికి కొనసాగింపుగానే చూడాలి. 2017లో పినరయి ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రాజెక్టు కింద ఇప్పటికే ఐదు లక్షల ఇళు ౣ పూర్తయ్యాయి. లక్షకు పైగా ఇళ్లు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయి. కొత్త ప్రభుత్వం ఇప్పుడీ పథకాన్ని పక్కన పెట్టడమంటే పేదలను క్రూరంగా పరిహసించడమే. 'లైఫ్' ప్రాజెక్టును ప్రభుత్వ ప్రత్యేక బాధ్యతగా తీసుకోకుండా, స్థానిక సంస్థలపై నింద వేసి, వాటి ఆధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణానికి తిలోదకాలివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి, ఇతరుల ప్రకటనల ద్వారా స్పష్టమవుతోంది. సొంత ఇల్లు లేని వారి వివరాల సేకరణను నిలిపేసింది. దీనికి తోడు 2023 భూ నమోదు చట్టాన్ని సవరించాలని నిర్ణయించింది. ఇది పేదలకు తోడ్పడడానికి కాదు, భూ కబ్జాదారులకు, అక్రమంగా రిసార్ట్‌లు, హోటళ్లు నిర్మించిన వారిని రక్షించడానికే. దీనంతటిని బట్టి చూస్తే, యుడిఎఫ్ ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన సంకేతాలు వారు దళితులకు, భూమి లేని వారికి, నిరాశ్రయులకు వ్యతిరేకమని స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడే యుడిఎఫ్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్ష సాధింపులకు దిగింది. ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయక ముందే రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. ఉద్యోగుల బదిలీలనే అసాధారణ ప్రక్రియ కూడా మితవాద యూనియన్ల లెటర్ ప్యాడ్‌పైనే జరిగింది. కేరళ యూనివర్సిటీ యూనియన్ ఎన్నికల్లో గెలిచిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తల విజయోత్సవంపై దాడి చేసిన కెఎస్‌యు సభ్యులను అడ్డుకోవడానికి బదులుగా, పోలీసులు ఆ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను దారుణంగా కొట్టి, వారిపై తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతంలో ముఖ్యమంత్రితో సహా మంత్రులు ప్రయాణిస్తున్న వాహనంపై దాడికి యత్నించినవారిని అడ్డుకున్న పోలీసు అధికారులపై చర్య తీసుకోవడం యుడిఎఫ్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపుకు తాజా ఉదాహరణ. వామపక్షాలను నాశనం చేయడం ద్వారా మాత్రమే కేరళంలో పాతుకుపోగలమని ఆర్ఎస్ఎస్, బిజెపి మతతత్వ శక్తులకు బాగా తెలుసు. ఇక్కడ వామపక్షాలు బలంగా ఉండటం వల్లే కేరళ లౌకికవాదానికి కంచుకోటగా నిలిచింది. సిపిఐ(ఎం), ఎల్‌డిఎఫ్ లను ఒంటరిగా ఓడించలేనందున, వాటిని నాశనం చేయడానికి హిందుత్వ మతోన్మాదం, మృదు హిందుత్వ శక్తులతో పొత్తు పెట్టుకుని ముందుకు సాగుతోంది. దేశంలో మృదు హిందూత్వకు ఒక ప్రత్యేక చిహ్నంగా కాంగ్రెస్ ఉంది. హిందూత్వ మతతత్వ శక్తులు వ్యూహాత్మకంగా వారికి అధికారంలోకి రావడానికి సహాయం చేస్తూ, కొత్త ప్రభుత్వం ద్వారా తమ సొంత ఎజెండాను అమలు చేస్తున్నాయనే అనుమానాలను ఈ చర్యలు రేకెత్తిస్తున్నాయి.

## విశాఖలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయండి

### ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో మంత్రి లోకేష్ భేటీ



**ముంబై, పతాకం న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రఖ్యాత హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబాయిలో సమావేశమయ్యారు. ఆసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్, ఆస్ట్రేలియా, జపాన్, మలేషియా, హాంకాంగ్, సింగపూర్‌లలో ఎయిర్ ట్రంక్ భారీ డేటా సెంటర్లను నిర్మించి నిర్వహిస్తోంది. ఈ భేటీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ...ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా వైజాగ్ ఆవిర్భవిస్తోంది. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీకనెక్స్ ఇతర ప్రధాన ప్రాజెక్టులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు అన్నివిధాలా అనుకూలతలు కలిగిన విశాఖపట్నం డేటా సెంటర్ హబ్ గా వేగంగా అభివృద్ధి చెందుతోంది. విశాఖ నగరంలో 6 గిగావాట్ల డేటా సెంటర్లను ఏర్పాటుచేయాలన్నది మా లక్ష్యం. మల్టీ-గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై మేం దృష్టిసారించాం. ఎయిర్ ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్ ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు మావద్ద అందుబాటులో ఉన్నాయి. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ కోసం రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు కూడా సిద్ధమవుతున్నాయి. ఏపీలో ఎయిర్ ట్రంక్ పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు. ఎయిర్‌ట్రంక్‌తో సంబంధాలను పునరుద్ధరణ, భారతదేశంలో తదుపరి దశ విస్తరణ, ఏఐ- హైపర్‌స్కేల్ మౌలిక సదుపాయాలు, ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా నిలిపే అంశంపై మంత్రి లోకేష్ చర్చించారు. రాబిన్ ఖుదా స్పందిస్తూ...ఎయిర్‌ట్రంక్ ఇండియా ప్రణాళికలు, మినా క్లౌడ్‌ఇన్‌ఫ్రాను స్వాధీనం చేసుకున్న తర్వాత దాని ఏకీకరణ, భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, విస్తరణ రోడ్‌మ్యాప్, కీలక కస్టమర్ సేవలు, హైపర్‌స్కేలర్ అవసరాలపై చర్చించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. భారతదేశంలో అగ్రగామి ఏఐ, హైపర్ స్కేల్ డేటా సెంటర్ హబ్ గా అవతరించాలన్న ఆంధ్రప్రదేశ్ దార్శనికతపై గత ఏడాది అక్టోబర్ లో మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తొలిసారి రాబిన్ ఖుదాతో అక్కడ సమావేశమయ్యారు. ఆ తర్వాత భారతదేశంలో విస్తరణ గురించి ఎయిర్ ట్రంక్ బృందం ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపింది. భారతదేశంలో ఒక ప్లాట్ ఫాం ఏర్పాటుచేశాక విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని ఎయిర్ ట్రంక్ బృందం తెలిపింది. ఏప్రిల్ 2026లో ఎయిర్‌ట్రంక్ అధికారికంగా భారతదేశంలోకి ప్రవేశించింది. ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో ప్రాజెక్టులు కలిగి, సుమారు 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రణాళికాబద్ధమైన పైప్‌లైన్‌తోపాటు, బ్లాక్‌స్టోన్ మద్దతు గల డేటా సెంటర్ ప్లాట్‌ఫామ్ లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రాను ఎయిర్ ట్రంక్ టేకోవర్ చేసింది. ఈ స్వాధీనం ఎయిర్‌ట్రంక్‌కు తక్షణ కార్యకలాపాల స్థావరాన్ని అందిస్తుంది. ఎయిర్ ట్రంక్ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భాగంగా భారతదేశాన్ని ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించింది. ఎయిర్‌ట్రంక్‌తో సంబంధాలను పునరుద్ధరణ, భారతదేశంలో తదుపరి దశ విస్తరణ, ఌ×- హైపర్‌స్కేల్ మౌలిక సదుపాయాలు, ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా నిలిపే అంశంపై మంత్రి లోకేష్... రాబిన్ ఖుదాతో చర్చించారు. ఎయిర్ ట్రంక్ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భాగంగా భారతదేశాన్ని ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించిందిదశాబ్దాల పోరాటానికి దక్కిన ఫలితం - అధికారికంగా అమల్లోకి దక్షిణ కోస్తా రైల్వే జోన్

## అధికారికంగా అమల్లోకి దక్షిణ కోస్తా రైల్వే జోన్




**విశాఖపట్నం, పతాకం న్యూస్:**మన రైళ్లు, మన లైన్లు మనమే నిర్ణయించుకునేలా దశాబ్దాల నాటి కల సాకారమైంది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భవించింది. జోన్ సాధన కోసం ప్రతి ఒక్కరూ సాయుధంగా మారి ఏళ్లుగా చేసిన పోరాటం ఫలించింది. తాత్కాలిక కార్యాలయంలో జోన్ కార్యకలాపాలు ప్రారంభంతో రాష్ట్ర ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూసిన చిరకాల స్వప్నం కూటమి ప్రభుత్వ పాలనలో ఆవిష్కృతమైంది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కోసం పార్టీలకతీతంగా జెండాలు వేరైనా ఒకటే అజెండాగా దశాబ్దాల ఉత్తరాంధ్ర నేతలు చేసిన పోరాటం విజయం సాధించింది. ఎర్రన్నాయుడు, వీఘూ మూర్తి, భాట్టం శ్రీరామ్మూర్తి, పల్లా సింహాచలం,పెతకంశెట్టి అప్పల నరసింహం, ద్రోణంరాజు శ్రీనివాసరావు వంటి నేతలు జోన్ సాధన కోసం పోరాటం చేశారు. తమ తర్వాత తరాలకు రైల్వే ప్రయాణాల కష్టాలు ఉండకూడదని ఆశపడ్డారు. ఎర్రన్నాయుడు కుమారుడు రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రిగా, వీఘూ మూర్తి మనవడు భరత్ ఎంపీగా, పల్లా సింహాచలం కుమారుడు పల్లా శ్రీనివాస్ గాజువాక ఎమ్మెల్యేగా, బీజేపీ నేత ౹ాఎ చలపతిరావు కుమారుడు మాధవ్ బీజేపీ అధ్యక్షుడిగా, పెతకంశెట్టి అప్పల నరసింహం కుమారుడు, ఎమ్మెల్యే గణబాబు ప్రభుత్వ విప్‌గా ఉన్న సమయంలో వారి తండ్రులు కన్న కల ఇప్పుడు నెరవేరింది. 18వ రైల్వే జోన్‌గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా అమల్లోకి వచ్చింది. 4 డివిజన్లతో కార్యాకలాపాలను ప్రారంభించింది. నూతన ప్రయాణంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న వాల్తేరు డివిజన్ విశాఖ డివిజన్‌గా రూపాంతరం చెందింది. జోనల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్ డీఆర్‌ఎంగా లలిత్ బొహరా సారథ్యం వహిస్తున్నారు. జోన్ ఏర్పాటుతో ఉద్యోగార్థుల కష్టాలు తీరుతాయని స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కార్మిక సంఘ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోన్ పరిధిలోకి 385 స్టేషన్లలో 62 వేల మంది ఉద్యోగులు విధుల నిర్వహించనున్నారు. ప్రాథమికంగా సుమారు 100 వరకు రైళ్లు సేవలు అందించనున్నాయి. ఏటా 100 మిలియన్ టన్నుల సరకు రవాణా జరగనుంది. రాష్ట్రంలో ఉన్న పోర్టులు, పరిశ్రమల ద్వారా సరకు రవాణా మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 6 పోర్టులు భవిష్యత్‌లో మరో ఐదు పోర్టులు జోన్ పరిధిలోకి రానున్నాయి. సరకు రవాణా, ప్రయాణికుల ద్వారా ఏటా రూ.15,500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.1

## సెల్ఫీ మోజులో లారీని ఢీకొట్టిన స్కూటీ..

## ముగ్గురికి తీవ్ర గాయాలు



**పాడేరు, పతాకం న్యూస్:** సెల్ఫీ మోజులో పడి స్కూటీపై వెళుతున్న ఇద్దరు యువకులు, ఓ మహిళ ప్రమాదానికి గురైన ఘటన సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగింది. ఈ ఘటన సీసీటీవీ కెమెరాల్లో నమోదైంది. సెల్ఫీ తీసుకుంటూ వాహనం నడపడంతో ముందున్న పరిస్థితిని గమనించలేక స్కూటీ నేరుగా రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న మహిళతో పాటు ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. క్షణిక నిర్లక్ష్యం ఎంతటి ప్రమాదాలకు దారితీస్తుందో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

(మొదటిపేజీ తరువాయి)

## వ్యాపారుల చెలగాటం!

పీఎస్ఎన్ఎం స్కూల్, నరసన్నపేట, టెక్కలి, పలాస కాశీబుగ్గ, ఇచ్ఛాపురం వంటి ప్రాంతాల్లో మగ్గబెట్టే కేంద్రాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ రోజుల తరబడి పండ్లను నిల్వ ఉంచుతారు. డిమాండ్‌ను బట్టి మగ్గబెడతారు. సరఫరా చేస్తారు. సాధారణ రోజుల్లో ప్రతిరోజూ 50 టన్నుల వరకూ అరటిపండ్లు, పది టన్నుల వరకూ ఆపిల్ పండ్లు, కమలాపండ్లు, మూడున్నర టన్నుల వరకూ సపోట, జామి, ఇతరత్రా పండ్లు వినియోగిస్తున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. వేసవిలో మాత్రం దాదాపు 45 రోజులపాటు సగటున 100 టన్నుల మామిడిని విక్రయిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. రసాయనాలతో మగ్గించిన పండ్లను తింటే అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. కడుపులో వికారం ఏర్పడి వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడతారు. రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలు వస్తాయి. చర్మవ్యాధులు సంభవిస్తాయి. తలనొప్పి, అలసట, నరాల సమస్యలు తలెత్తుతాయి. ఊపిరితిత్తులు, మూత్రాశయ వ్యాధులు సంక్రమిస్తాయి. మూత్రపిండాలు దెబ్బతినడమే కాకుండా కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. మానసిక వ్యాధులు కూడా సంక్రమిస్తాయి. కనురెప్పల వాపు తదితర కంటి సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు. మచ్చలు లేని పండ్లు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. పండ్లను కాసేపు వేడినీటిలో ఉంచి.. మైనపు పూతలా ఉంటే తొక్కను తీసి గమనించాలని తెలిపారు.

## హోం మంత్రి అనిత పర్యటన

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వం గత రెండేళ్లుగా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నెల ఒక గ్రామానికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయడంతో పాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి గ్రామ స్థాయి నాయకుల వరకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ సెలవు రోజు వచ్చినా, ముందుగానే 31వ తేదీన పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధిక పెన్షన్ అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని మంత్రి పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు దిశగా కూడా ప్రభుత్వం కీలక అడుగులు వేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం 50 ఎకరాల భూమి కేటాయించకపోవడంతో రైల్వే జోన్ ఏర్పాటుకు ఐదేళ్లు ఆలస్యమైందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీతో చర్చించడంతో రైల్వే జోన్ సాధ్యమైందని చెప్పారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి రైల్వే జోన్ ఒక వరమని పేర్కొన్న మంత్రి, ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని మంత్రి అనిత తెలిపారు.

## చేస్తున్నాం: చంద్రబాబు

ఆదుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్, నేను కలిసి పని చేస్తున్నాం. డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తే వైఎస్సార్సీపీ ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి ఆ పార్టీకి ఫ్రస్టేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'. అని చంద్రబాబు అన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి జోలికొస్తే ఆయనే చూసుకుంటారని, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం మంచి పని కాదు సీఎం హెచ్చరించారు. ఆలయాలను అపవిత్రం చేయాలని చూస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహంపై దాడి చేసి మాపై నెట్టాలని చూశారని మండిపడ్డారు. ఆరా తీస్తే వైఎస్సార్సీపీ వాళ్లే చేసినట్లు రుజువైందన్నారు. విగ్రహం ధ్వంసం చేశారని అబద్ధాలు చెప్పి సానుభూతి కోసం ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. దళితుణ్ని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఊరేగిస్తారా? అని సీఎం సూటిగా ప్రశ్నించారు. సీబీఎన్ పాలనలో అరాచక శక్తులకు చోటు లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యమని సీఎం హితవు పలికారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే మా ధ్యేయమని 2027 పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. కొత్తపల్లి మండలంలో ఫిషింగ్ హార్బర్ తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి వేదిక దిగి వెళ్తూ అక్కడే ఉన్న దివ్యాగుడ్ని పలకరించారు. అతనితో మాట్లాడి, సెల్ఫీ దిగారు.

## 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు: సత్యకుమార్

చేయాలని నిర్ణయించామన్నారు. ఈ ఏడాది రెండున్నర లక్షల మందిని భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు కోరినట్లు తెలిపారు. వెస్ట్రన్ బైసాప్‌లో 25 వేల మందితో యోగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2020-25 వరకు మెంటల్ హెల్త్ విషయంలో సగటున 8 వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని సత్యకుమార్ తెలిపారు. డయాబెటిక్స్, హైపర్ టెన్షన్‌ల కేసులు విపరీతంగా పెరగుతున్నాయన్నారు. అందుకే ఆధునిక జీవన విధానంలో ధ్యానం చాలా అవసరమన్నారు. జూన్ 1 నుంచి 30 వరకు యోగాకు సంబంధించి యూట్యూబ్ వీడియోలను 3 నిముషాల నుంచి గంట వరకు మంతెన సత్యనారాయణ రాజు తయారు చేసినట్లు తెలిపారు. యోగాను విద్యా కరిక్యులమ్‌లో కూడా చేర్చడం జరిగిందని... వేసవి కాలం తరువాత విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 1 నుంచి జూన్ 20 వరకు యోగాలో వివిధ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ కోసం మీడియా కూడా సహకరించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

# ప్రమాదకరంగా కొత్తూరు కాలేజీ బ్రిడ్జి.. పట్టించుకోని అధికారులు..



**కొత్తూరు, పతాకం న్యూస్:** అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న కాలేజీ వంతెన ప్రమాదకరంగా ఉంది. అడుగడుగునా గోతులతో, వంతెన శ్లాబ్ ఊచలు పైకి లేచి అధ్వానంగా ఉంది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కేబీ రోడ్డు గుండా సుమారు 32 గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కాలేజీ బ్రిడ్జి కూడలిలో పెద్ద గోతులు ఉండడంతో భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఈ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. అంతేకాకుండా బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు దెబ్బతిని పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా ఉంది. ఫుట్‌పాత్ పలకలు విరిగిపోవడంతో అందులో పిచ్చిమొక్కలు మొలిచాయి. బ్రిడ్జికి మధ్యలో శ్లాబ్ ఊచలు పైకి లేచి ఉండడంతో వాహనాలకు పంక్చర్లు అవుతున్నాయి. సుమారు ఏడాదిన్నర నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ బ్రిడ్జికి మరమ్మతులు చేయకపోవడం దారుణమని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెనకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

# శరవేగంగా విశాఖ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులు ఎట్టకేలకు పుంజుకున్నాయి. ఆరంభ దశలో కాంట్రాక్టర్ల వివాదంతో ఏడాదిన్నర ఆగిపోయిన పనులు ఇటీవల ఊపందుకున్నాయి. సుమారు రూ.500 కోట్ల అంచనాతో ప్రారంభమైన పనులకు దశల వారీగా వేయి కోట్ల వరకు వెచ్చిస్తామని రైల్వే ఉన్నతాధికారులు చెబుతున్నారు. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో అదేస్థాయిలో స్టేషన్ కూడా ఉండాలని అధికారులు ముందుగానే ప్రణాళిక రూపొందించారు. స్టేషన్‌కు కొత్త రూపు తీసుకురావడంతో పాటు అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డీపీఆర్ తయారు చేసి ఆమోదం పొందారు. దాని ప్రకారం ప్రస్తుతం రైల్వే స్టేషన్‌ను జ్ఞానాపురం వైపు విస్తరిస్తున్నారు. ఇప్పుడు ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా అదనంగా మరో ఆరు నిర్మించనున్నారు. అప్పుడు మొత్తం ప్లాట్‌ఫారాల సంఖ్య 14కు చేరుతుంది. దీంతో మరిన్ని కొత్త రైళ్లు రావడానికి అవకాశం ఉంటుంది. స్టేషన్‌ను 'యు' ఆకారంలో అభివృద్ధి చేస్తున్నారు. దీనివల్ల ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు ప్రయాణికులు వెళ్లడానికి సౌలభ్యంగా ఉంటుంది. కోల్‌కత్తాలో మాదిరిగా షాపింగ్ కోసం ప్రత్యేక నిర్మాణం (కాంకోర్) కూడా ప్లాన్ చేశారు. ప్రస్తుత ప్రవేశ ద్వారం ఉన్న వైపు టెర్మినల్ భవనాన్ని గ్రౌండ్ం2 మోడల్‌లో నిర్మిస్తారు. ఆ తరువాత జిం5కు విస్తరిస్తారు. అటు జ్ఞానాపురం వైపు రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్, పార్కింగ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. మొదట మల్టీలెవెల్ కారు పార్కింగ్ భవనం నిర్మించాలని అనుకున్నారు. కానీ అందుబాటులో భూమి ఉండడంతో ఓపెన్ పార్కింగ్‌కే ప్రాధాన్యం ఇచ్చారు. సుమారుగా 1.5 లక్షల చ.అ. విస్తీర్ణంలో రెండు వేల వాహనాలు (కార్లుంద్విచక్ర వాహనాలు) పట్టేలా కవర్డ్ పార్కింగ్ నిర్మాణం పూర్తిచేశారు. దీనికి ఏఐ టెక్నాలజీ ఆధారిత ప్రవేశం ఏర్పాటుచేసే ఆలోచన ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పనుల్లో భాగంగా ఆ ప్రాంతంలో ఎర్రిగెడ్డ మళ్లింపు పనులు కూడా చేపట్టారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

# ఏఐ సహకారంతో ట్రాఫిక్ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహకారంతో ట్రాఫిక్ నిర్వహించాలని ఎంతోకాలంగా పోలీసులు చేస్తున్న యత్నాలకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు సిస్టమేటిక్ ఆగ్మెంటెడ్ రేడియల్ ట్రాఫిక్ అండ్ హూప్ ఇండక్షన్ (ఎస్ఏఆర్‌టీహెచ్ఐ) అని నామకరణం చేశారు. దీనికి రూ.99.19 కోట్లు అవసరమని లెక్క తేల్చారు. ఇందులో 60 శాతం రూ.49.54 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. రూ.20 కోట్లు సమకూర్చాల్సిందిగా వీఎంఆర్‌డీఏకు సూచించింది. మిగిలిన మొత్తాన్ని, ఐదేళ్ల నిర్వహణ నిధులను జీవీఎంసీ పెట్టుకోవాలని పేర్కొంది. అంతేకాకుండా ఈ విధానంలో జారీచేసే చలాన్ల వసూళ్ల ద్వారా వచ్చే మొత్తాన్ని ఉపయోగించుకోవాలని సూచించింది. ఎస్ఏఆర్‌టీహెచ్ఐకు ఒక కమిటీని ఏర్పాటుచేస్తారు. ఈ కమిటీలో పోలీస్, జీవీఎంసీ, రవాణా, ఆర్టీసీ అధికారులు ఉంటారు. ప్రాజెక్టు పనులను కలెక్టర్ ప్రతి మూడు నెలలకొకసారి సమీక్షించాలని సూచించింది. అంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చేయడానికి, ట్రాఫిక్‌ను సాఫీగా నడపడానికి, ప్రమాదాలను తగ్గించడానికి, భద్రత కోసం ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. నగరంలో అన్ని జంక్షన్లలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. వాటిని ఏఐ పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కలుపుతారు. అక్కడి నుంచి అన్నీ పరిశీలిస్తారు. సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా బండి నడపడం, బెల్ట్ పెట్టుకోకుండా కారు డ్రైవ్ చేయడం, సరైన నంబరు ప్లేటు లేకుండా వెళ్లడం వంటి ఉల్లంఘనలన్నింటినీ ఈ కెమెరాలు ఫొటోలు తీసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపుతాయి. అక్కడి నుంచి చలాన్లు జారీ అవుతాయి. జరిమానా వేస్తారు. ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటే దాన్ని క్లియర్ చేయడానికి సూచనలు చేస్తారు. సిబ్బందిని పంపుతారు. సిటీలో 101 ట్రాఫిక్ జంక్షన్లలో ఈ సాంకేతికతతో కూడిన సీసీ టీవీ కెమెరాలు పెడతారు. ప్రధానంగా నిబంధనలు ఉల్లంఘించే 90 జంక్షన్లు గుర్తించి వాటిపై దృష్టిసారిస్తారు. ట్రాఫిక్ సాఫీగా సాగిపోయే 14 జంక్షన్లు గుర్తించారు. వాటిపై మానటరింగ్ ఉంటుంది. సిటీలో మొత్తం 131.80 కి.మీ. పొడవున ఈ ఏఐ నిఘా ఉంటుంది. పాదచారుల భద్రతకు 12 ప్రాంతాలు గుర్తించారు. ఈ ప్రాజెక్టును జీవీఎంసీ అమలు చేస్తుంది.

# ఘనంగా గవిరెడ్డి రామానాయుడు జన్మదిన వేడుకలు

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



**దేవరాపల్లి, పతాకం న్యూస్ :** చీడికాడ మండలంలో అప్పలరాజుపురం గ్రామంలో మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని గ్రామంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి, శిబిరాన్ని సందర్శించారు. రక్తదాతలను అభినందించిన ఎమ్మెల్యే బండారు, గవిరెడ్డి రామానాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో మాజీ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టిమిరెడ్డి సూర్యనారాయణ, మాడుగుల నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కర్రి సింహాద్రి అప్పలనాయుడు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె దేముళ్ళు, తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సిహెచ్. మురళీకృష్ణ (బాబ్జి) ఉన్నారు. వీరితో పాటు మండల పరిధిలోని పలువురు టీడీపీ నాయకులు, జనసేన, కూటమి నాయకులు భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గాజువాక డిపోలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్‌కు భూమి పూజ



**గాజువాక, పతాకం న్యూస్:** ఏపీఎస్‌ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే ప్రసక్తే లేదని, రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. గాజువాక ఆర్టీసీ బస్సు డిపోలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. విశాఖకు 100 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని, వీటిలో 50 బస్సులు గాజువాక ఆర్టీసీ డిపోనకు కేటాయిస్తున్నామన్నారు. ఈ మేరకు పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. సంస్థకు కార్మికులు, ప్రయాణికులు ముఖ్యమని, త్వరలోనే సీఎన్‌జీ బస్సులు నడిపే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. త్వరలో 1,450 కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. కాపు తుంగ్లాం నుంచి ఆర్‌కే బీచ్ వరకు నూతన బస్సును మంత్రి ప్రారంభించారు. ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, ఈడీ గీత, తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానాపురంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**జ్ఞానాపురం, పతాకం న్యూస్:** జ్ఞానాపురం ప్రాంతంలో నిర్వహించిన సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. ప్రతి నెల ఒకటో తేదీన పండుగ వాతావరణంలో కొనసాగుతున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే సామాజిక పెన్షన్లు అందించడం ద్వారా ప్రభుత్వం వారి పట్ల తన బాధ్యతను చాటుకుంటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమం--అభివృద్ధి రెండు కళ్లలా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి ప్రభుత్వ పథకం పారదర్శకంగా అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీ మల్లయ్య నాయుడు , కూటమి వార్డు అధ్యక్షులు ఆంథోనీ శేఖర్ , మధు బాబు , పార్టీ నేతలు రమణ , సునీత, స్థానిక నాయకులు, వార్డు ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేపగుంటలో పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పంచకర్ల



**పెందుర్తి, పతాకం న్యూస్:** జీవీఎంసీ 94వ వార్డు వేపగుంటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. వేపగుంట 485 సచివాలయం పరిధిలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల లబ్ధిదారులకు స్వయంగా ఇంటి ఇంటికి వెళ్లి వృద్ధులకు వితంతువులకు దివ్యాంగులకు నెలవారీ పెన్షన్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించి ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు ముఖ్యమంత్రి, చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సేవలో తాను ముందు ఉంటామని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదలకు కొండంత అండ అని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వార్డులోని స్థానిక ప్రజలు నుండి స్వయంగా సమస్యలను అడిగితెలుసుకున్నారు.సచివాలయ సిబ్బందికి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో పెందుర్తి జోన్ జోనల్ కమిషనర్ శంకర్రావు , ఏపీ డి ఓ గంగాధర్ ,వార్డు మాజీ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు , వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి , సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నీటిపల్లి మహేష్ , పెందుర్తి ఏఎంసి వైస్ చైర్మన్ గోరపిల్లి సోమనాయుడు , ఏఎంసీ డైరెక్టర్ లక్కీ గోవింద్ , హైమావతి ,వార్డు నాయకులు సేనాతిదేవుడు , గంటల దివాకర్ , గంట్ల దేవుడు గారు, పిల్లా జగన్మోహన్ పాత్రుడు ,గంటల అప్పారావు , మోటారు చైతన్య రాపర్తి కిషోర్ ు, గొర్లి అప్పారావు, కోన మోహన్ కుమార్ నాయుడు, అర్జిల్లా అప్పలరాజు తదితర జీవీఎంసీ 94 వ ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సామాజిక పెన్షన్లు పంపిణీ చేసిన గంటా



**సాగర్‌నగర్, పతాకం న్యూస్:** సంక్షేమ పథకాల అమలు ద్వారా పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. సాగర్ నగర్ లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. పెన్షన్లు, జీతాలు ప్రతి నెల 1 వ తేదీన క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామన్నారు. ప్రతి నెల రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మందికి రూ. 2,728 కోట్లు నేరుగా నగదు పెన్షన్ల రూపంలో అందిస్తున్నామని.. భీమిలి నియోజకవర్గంలో 14 వేల మందికి రూ.6.34 కోట్లు ఇస్తున్నామని వివరించారు. ఈనెల స్పౌజ్ కోటాలో 5606 మంది వితంతువులకు సామాజిక పెన్షన్లు అందించామన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేర్చి వారి నమ్మకం గెలుచుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చెట్టుపల్లి సన్యాసిరావు, శాఖారి శ్రీనివాస్, లొడగల అప్పారావు, సారిపల్లి శ్రీనివాస్, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజారు అందుబాటులోకి రావడం పట్ల హర్షం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** రైతుబజారు అందుబాటులోకి రావడం, ప్రైవేటు దుకాణాలతో పోలిస్తే కూరగాయల ధరలు బాగా తక్కువగా వుండడం, తాజా కూరగాయలు లభిస్తుండడంతో పట్టణవాసులు చాలా ఆనందంగా వున్నారు. స్థానిక ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుబజారును గత ప్రారంభించిన విషయం తెలిసిందే. మొత్తం వంద స్టాళ్లు వుండగా.. వీటిలో 72 స్టాళ్లను రైతులకు, 25 స్టాళ్లను డ్వాక్రా సంఘాలకు, మూడింటిని దివ్యాంగులకు కేటాయించారు. కానీ పూర్తిస్థాయిలో రైతులు రావడం ఇంకా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం అనకాపల్లి మండలం గోపాలపురం, మునగపాక మండలం గణపర్తి, కె.కోటపాడు మండలం సింగన్నదొరపాలెం, దాలివలస, దేవరాపల్లి మండలం వెంకటరాజపురం, పరవాడ మండలం తానాం తదితర ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలు, ఆకు కూరలను తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. బయట మార్కెట్ ధరలతో పోల్చితే రైతుబజారులో కూరగాయల ధరలు తక్కువగా ఉన్నాయని వినియోగదారులు అంటున్నారు. ప్రైవేటు దుకాణాల్లో బీరకాయలు కిలో రూ.50కి అమ్ముతుండగా.. రైతుబజారులో రూ.30కే లభిస్తున్నాయి. బంగాళదుంపలు బయట మార్కెట్‌లో రూ.20 కాగా రైతుబజారులో రూ.15కు అమ్ముతున్నారు. బెండకాయలు కిలో రూ.40లు కాగా రైతుబజారులో రూ.26, దొండకాయలు కిలో రూ.30కాగా, రైతుబజారులో రూ.20కి అమ్ముతున్నారు. బయట ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే క్యారట్, టమాటా, బీన్స్, బీట్‌రూట్, క్యాబేజీ, క్యాప్సికమ్ వంటి కూరగాయల ధరలు బయట మార్కెట్‌కు, రైతుబజారుకు రూ.5 నుంచి రూ.10 వరకు తేడా వుంది.

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తుల నియామకం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సర్వోన్నత న్యాయస్థానానికి ఐదుగురు కొత్త న్యాయమూర్తులు నియమితులయ్యారు. నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలంటూ కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదముద్ర వేసింది. ఈ నియామకాలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(2) ప్రకారం ఈ నియామకాలు జరిగాయని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మే 22, 27 తేదీల్లో జరిగిన సమావేశాల్లో సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఐదుగురి పేర్లను పదోన్నతి కోసం కేంద్రానికి సిఫార్సు చేసింది. కొత్తగా నియమితులైన వారిలో పంజాబ్, హరియాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా, జమ్మూకశ్మీర్, లడఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. వీరితో పాటు సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ వి. మోహనను కూడా నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కాకుండా న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచుతూ రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో తాజా నియామకాలకు ప్రాధాన్యత ఏర్పడింది. కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు వివిధ హైకోర్టులలో విశేష అనుభవం ఉంది. జస్టిస్ నాగు 2011 నుంచి జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ సచ్‌దేవా, జస్టిస్ పల్లి 2013 నుంచి న్యాయమూర్తులుగా సేవలందిస్తున్నారు. సీనియర్ అడ్వకేట్ మోహన సుప్రీంకోర్టులో రాజ్యాంగ, సివిల్, సర్వీస్ సంబంధిత కేసుల వాదనలో నిపుణురాలిగా పేరుగాంచారు. ఈ నియామకాలతో సుప్రీంకోర్టులో కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయి.

## పొంగిపొర్లిన పుల్లేరు వంక.. నిలిచిన రాకపోకలు



**కడప, పతాకం న్యూస్:** ఆకురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లాయి. ముద్దనూరు పులివెందుల రహదారి లోని టెలిఫోన్ ఎక్చ్సేంజ్ సమీపంలో ఉన్న పుల్లేరు వంక పొంగి పొర్లింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పులివెందుల -- ముద్దనూరుకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పులివెందులకు వెళ్లాల్సిన వాహనాలు, వాహనదారులు, ప్రయాణికులు ముద్దనూరు నుంచి ఎర్రగుంట్ల, వేంపల్లి మీదుగా ప్రయాణం సాగించారు. ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా హిందూపురం వరకు 716 జి నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. నల్లబల్లె వద్ద బ్రిడ్జి పనులు చేస్తుండటంతో పక్కన తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. వాగు ధాటికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. సిఐ నగేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని ఎలాంటి వాహనాల రాకపోకలకు ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. వరద తగ్గిన తర్వాత రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనాలు రాకపోకలకు అనుమతిచ్చారు. తహశీల్దార్ అలీఖాన్ పరిశీలించి తగిన సూచనలు చేశారు.

# తిరుమలలో రికార్డు సృష్టించిన భక్తులు..



**అనకాపల్లి, పతాకం న్యూస్:** తిరుమలలో కొలువుదీరిన శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు.. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్వామి వారి దర్శనానికి ముందుగా భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. ఈ ఏడాది తలనీలాలను భక్తులు రికార్డు స్థాయిలో సమర్పించారు. మే మాసంలో 12,43,063 మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు ఇచ్చారు. మే 1 నుంచి మే 27వ తేదీ వరకు శ్రీవారికి మొక్కుల రూపంలో భక్తులు తననీలాలు సమర్పించుకున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. గతంలో ఉన్న రికార్డులను ఇది అధిగమించిందని తెలిపింది. 2024 మే నెలలో 10.65 లక్షల మంది, 2025, మే మాసంలో 10.18 లక్షల మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారని గణాంకాలతో సహా టీటీడీ వివరించింది. మే 18 నుంచి 23వ తేదీ వరకు ప్రతి రోజు 50 వేల మంది భక్తులు తలనీలాలు ఇచ్చారని చెప్పింది. అయితే మే 23వ తేదీ ఒక్క రోజే.. 57,580 మంది భక్తులు తమ మొక్కుల కింద తలనీలాలు ఇచ్చారని పేర్కొంది. ఇటీవల కాలంలో అత్యధికంగా తలనీలాలు సమర్పించినది మే 23వ తేదీ అని టీటీడీ స్పష్టం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుమలలో కళ్యాణకట్టతోపాటు 11 తలనీలాల కేంద్రాలు ఏర్పాటు చేశామని టీటీడీ వివరించింది. తలనీలాల కోసం 1,150 మంది మంగలి వారిని ఏర్పాటు చేశామంది. వారిలో 269 మంది మహిళలు కూడా ఉన్నారని చెప్పింది. మొక్కుల రూపంలో భక్తులు ఇచ్చిన తలనీలాలను విదేశాలు.. చైనా, ఇటలీ, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తామని టీటీడీ పేర్కొంది. అలాగే ఇటీవల కాలంలో తలనీలాలను వేలంపాటు వేయడం ద్వారా వస్తున్న ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపింది. తలనీలాల ద్వారా 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 67 కోట్లు వచ్చిందని వివరించింది. ఇలా ప్రతి ఏడాది తలనీలాల ద్వారా టీటీడీకి భారీగా ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం తలనీలాల ద్వారా రూ.200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని టీటీడీ పేర్కొంది. వేసవి సెలవులతోపాటు వారాంతం సెలవుల కారణంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని తిరుమల తిరుపతి దేవస్థానం వివరించింది.

## ఎస్.కోట నియోజకవర్గంలోని నాలుగు రైల్వేస్టేషన్లు రెండుజోన్లలోకి మార్పు



**కొత్తవలస, పతాకం న్యూస్:** శృంగవరపుకోట నియోజకవర్గంలోని నాలుగు రైల్వే స్టేషన్లలో రెండు సౌత్‌కోస్టు రైల్వేజోన్(విశాఖ)లోకి వెళ్లగా మరో రెండు స్టేషన్లు ఈస్టు కోస్టు రైల్వేజోన్‌లో ఉండనున్నాయి. ఈ మేరకు కేంద్రం గజిట్ విడుదల చేసింది. విశాఖ జోన్ కార్యకలాపాలు అధికారికంగా సోమవారం నుంచే ప్రారంభం కానున్నాయి. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ నాలుగు రైల్వే డివిజన్‌లతో సౌత్ కోస్టు రైల్వేజోన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేయగా సోమవారం నుంచి రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ జోన్ ఏర్పాటు చేయకముందు శృంగవరపుకోట నియోజకవర్గంలో ఉన్న కొత్తవలస, కంటకాపల్లి, మల్లివీడు, శృంగవరపుకోట రైల్వేస్టేషన్‌లు వాల్తేరు డివిజన్‌లోనే ఉండేవి. కొత్తవలస - కిరండోల్ రైల్వే మార్గంలో ఉన్న అన్ని రైల్వే స్టేషన్‌లను వాల్తేర్ రైల్వే డివిజన్ నుంచి వేరుచేసి రాయగడ డివిజన్‌లోకి మార్పు చేశారు. రాయగడ రైల్వే డివిజన్ ఒడిశాలోని భువనేశ్వర్ కేంద్రంగా నడుస్తున్న ఈస్టుకోస్టు రైల్వేజోన్‌లోఉంది. కొత్తవలస- కిరండోల్ రైల్వేమార్గంలో ఉన్న లక్కవరపుకోట మండలం మల్లివీడు, శృంగవరపుకోట రైల్వే స్టేషన్‌లు రాయగడ డివిజన్‌లోకి వెళ్లిపోయాయి. కొత్తవలస, కంటకాపల్లి రైల్వే స్టేషన్‌లు కొత్తగా విశాఖకేంద్రంగా ఏర్పాటు చేసిన విశాఖ డివిజన్‌లోని సౌత్‌కోస్టు రైల్వే జోన్‌లోకి వచ్చాయి. దీంతో కొత్తవలస, కంటకాపల్లి రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనుల కోసం విశాఖ జోన్ కార్యాలయానికి వెళ్తే సరిపోతుంది. మల్లివీడు, శృంగవరపుకోట రైల్వే స్టేషన్లలో ఏపని చేయించుకోవాలన్నా ఈస్టుకోస్టు రైల్వేజోన్ పరిధిలోని రాయగడకు గాని, భువనేశ్వర్‌కుగాని వెళ్లాల్సిందే. శృంగవరపుకోట, మల్లి వీడు రైల్వేస్టేషన్‌లను విశాఖకేంద్రంగా ఉన్న సౌత్ కోస్టు రైల్వేజోన్‌లో కలపాలని కోరినా ఇప్పటికే కేంద్రప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ జారీ చేసినందున సాధ్యం కాదంటున్నారు.

## తాడుతో ఆటోను లాగుతూ ... ఆటో డ్రైవర్ల వినూత్న నిరసన



**విజయనగరం, పతాకం న్యూస్:** జూన్ 1 న డ్రైవర్లు డే సందర్భంగా .... ఆటో డ్రైవర్లకు ఉపాధిని దెబ్బ తీసే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ .... ఆటోలకి తాడు కట్టి లాగుతూ సిఐటియు వినూత్న నిరసన కార్యక్రమం సోమవారం స్థానిక కోట జంక్షన్ వద్ద చేపట్టారు. శ్రీ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ .... ఒకవైపున ఊబర్, ఓలా వచ్చి ఆటోలకి ఉపాధి ని దెబ్బ కొడుతుంటే, మరోవైపు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఉన్న కొద్ది పాటి ఉపాధి లేక నానా యాతన పడుతున్న ఆటో డ్రైవర్లకు మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఉందన్నారు. కేంద్రంలో ఎన్ డి ఎ ప్రభుత్వం ఒక్క సారి పది రోజుల గ్యాపులో అనేక మార్లు పెట్రోల్, డిజల్ ధరలు పెంచిందన్నారు. దీని వలన ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్ లీటర్ 137 రూపాయలు అయ్యింది, ఇది ఆటో డ్రైవర్లకు మోయలేని భారమన్నారు. రాష్ట్రములో కూటమి అధికారం లోకి వచ్చిన నుండి ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలు కూడా అందరికి ఇవ్వకుండా ఇబ్బందులకి గురి చేస్తుందని ఆవేదన చెందారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాపిత ఉద్యమం నడుపుతామని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి. బి. రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయాకులు పాపారావు, తదితరులు పాల్గొన్నారు. మొక్కుల రూపంలో భక్తులు ఇచ్చిన తలనీలాలను విదేశాలు.. చైనా, ఇటలీ, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తామని టీటీడీ పేర్కొంది. అలాగే ఇటీవల కాలంలో తలనీలాలను వేలంపాటు వేయడం ద్వారా వస్తున్న ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపింది. తలనీలాల ద్వారా 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 67 కోట్లు వచ్చిందని వివరించింది. ఇలా ప్రతి ఏడాది తలనీలాల ద్వారా టీటీడీకి భారీగా ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేసింది.

## ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి



**కర్ణాటక, పతాకం న్యూస్:** కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి సమీపంలోని జాతీయ రహదారి-44పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి కర్ణాటక పోలీసులు తెలిపిన వివరాల మేరకు...బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు థార్ వాహనం వెళ్లుంది. ఇదే సమయంలో వ్యవసాయ కార్మికులను తీసుకెళ్తున్న ఆటోను బాగేపల్లి సమీపంలోని గంగోత్రి పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వచ్చింది. ఈ సమయంలో ఆటో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టాడు. దీంతో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు బాగేపల్లి పట్టణానికి చెందిన ఉమాదేవి (55), అరుణమ్మ(44), విజయ (45), లక్ష్మమ్మ (50), సరోజమ్మ (65), చిలమత్తూరు మండలం సద్దుపల్లి గ్రామానికి చెందిన అంజినప్ప (35)గా గుర్తించారు. మరో నలుగురు గాయపడ్డారు. ఆటోలో డ్రైవర్‌తో కలిపి మొత్తం పది మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. వీరంతా వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు ఆటో పూర్తిగా ధ్వంసమైపోగా, ప్రయాణికులు వాహనంలోనే చిక్కుకుపోయారు. స్థానికులు, పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీశారు. మిగతా నలుగురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటన స్థలాన్ని చిక్కబల్లాపూర్ జిల్లా ఎస్పి కుశాల్ చౌక్సి పరిశీలించారు.

## కొండల తవ్వకాలు ఆపండి.. వన్యప్రాణులను కాపాడండి..



**విజయనగరం, పతాకం న్యూస్:** కొండల తవ్వకాలు ఆపాలని కోరుతూ .... పూసపాటి రేగ మండలం, పతివాడ, రాయుడుపేట, చిన్న పతివాడ, బర్రిపేట, తమ్మయ్య పాలెం గ్రామ ప్రజలు సోమవారం ఆందోళన చేపట్టారు. ' మా ఊరును ఆనుకొని ఉన్న రెండు కొండలను తవ్వొద్దు - అంటూ ... సోమవారం గ్రీవెన్స్ లో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ... ఈ రెండు కొండల మీద అనేక వందల వన్యప్రాణులు ఉన్నాయి వాటిని కాపాడాలి వాటిని కాపాడితేనే రేపటి తరంకు మన అన్నవాళ్లు వాటి ఆనవాళ్లు తెలుస్తాయన్నారు. అదే విధంగా ఈ రెండు కొండలను ఆనుకొని మూడు పెద్ద చెరువులు ఉన్నాయనీ, కొండ దారకొండ వచ్చే వర్షపు నీరు పడి చెరువులు పుష్కలంగా నిండి తమ గ్రామాల కింద ఉన్న వందల ఎకరాల భూములకు వ్యవసాయ ఆధారంగా ఉంటాయి అని తెలిపారు. ఈ కొండలను తవ్వడం వలన వాటిని కోల్పోయి వ్యవసాయం లేకుండా పోతుందన్నారు. వన్యప్రాణులు ఆశ్రయాన్ని కోల్పోతాయన్నారు. ఇక్కడ కొండలను అనుకొని ఎన్టీఆర్ కాలనీ అనేక లేఅవుట్లు ఉన్నాయనీ వీటన్నిటిని కాపాడాలని కోరారు.

## వైసీపీపై మంత్రి అనగాని ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

గొడ్డలి పార్టీ నేతలే తీయించడం.. మళ్లీ ధర్నాలు చేయడం ఆ పార్టీకే చెల్లిందంటూ దుయ్యబట్టారు. శవం, సింపతీ, స్టాట్యూ అనేది గొడ్డలి పార్టీ విధానమంటూ వ్యాఖ్యానించారు. వైఎస్ మరణంతో రాష్ట్ర వ్యాప్తంగా విగ్రహాలు పెట్టి రాజకీయం చేశారని.. ఇప్పుడు అదే విగ్రహాలను విధ్వంసం చేసి రాజకీయం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. గతంలోనూ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి తెలుగుదేశం పార్టీపై నెపం నెట్టే ప్రయత్నం చేశారన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం విషయంలో కుట్రలు బయటపడ్డాయి కాబట్టి... సాక్షిలో పెద్దగా కవరేజ్ ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని గొడ్డలి పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తుంటే.. డీఎస్సీలో తప్పిదాలు జరిగాయని ఆరోపణలు గుప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి వ్యవహారాలు బయటపడుతుండడంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఏడాది క్రితం జరిగిన డీఎస్సీ నిర్వహణకు సంబంధించి ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు పన్నడం, అసత్య ప్రచారం చేయడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉందంటూ వ్యాఖ్యానించారు.

# గోదావరినదిలో కాలుష్యం పోయేనా?



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పర్యటనలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గోదావరి నది కాలుష్యంపై తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తెలుగు ప్రజల జీవనాడులుగా ప్రసిద్ధికెక్కిన గోదావరి, కృష్ణా నదులు కాలుష్యం కాటుకు గురవుతున్న తీరుపై ఆందోళనలు వ్యక్తం కావడం ఇదే మొదటి సారి కాదు. ఇప్పటికే ఎన్నో నివేదికలు ఆ విషయాన్ని ఎత్తి చూపాయి. పర్యావరణవేత్తలు ఎన్నో సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. అయినా, ప్రభుత్వ యంత్రాంగంలో ఇప్పటి వరకు చలనం లేదు. ఇప్పుడు పర్యావరణ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కల్యాణ్ స్వయంగా స్పందించడంతో ఏమైనా మార్పు వస్తుందేమో చూడాలి. నిజానికి మానవ నాగరికత నదీ తీరాల ఒడ్డునే అభివృద్ధి చెందింది. సింధు నాగరికత నుంచి నైలు, టైగ్రిస్, యూఫ్రటిస్, గంగా ఇలా ప్రపంచ చరిత్ర అంతా నదుల చుట్టూనే తిరిగింది. నీరు ఉన్న చోటే మనిషి స్థిరపడ్డాడు. వ్యవసాయం పుట్టింది. పట్టణాలు ఏర్పడ్డాయి. సంస్కృతులు వికసించాయి. కానీ ఇప్పుడు అవే నాగరికతలు పరిశ్రమలు, నగరాల రూపంలో, నియంత్రణలేని వినియోగ సంస్కృతి రూపంలో నదులను మురుగుకాలువలుగా మార్చేస్తున్నాయి. గోదావరి, కృష్ణాలు కూడా దీనికి మినహాయింపు కాదు. ఆంధ్రా పేపర్ మిల్లు నుంచి గోదావరిలో కలుస్తున్న కాలుష్య జలాలను చూసి పవన్ కల్యాణ్ నిశ్చేష్టులైనట్లు వార్తలు వచ్చాయి. అదొక్కటే కాదు. రాజమహేంద్రవరం నుంచి ధవళేశ్వరం వరకు గోదావరిలో పెరుగుతున్న జీవ, రసాయన ఆమ్లజనులు (బిఒడి) పారిశ్రామిక వ్యర్థాలు, శుద్ధి చేయని మురుగునీరు, కెజి బేసిన్ ఆయిల్ అండ్ గ్యాస్ కాలుష్యం, కాకినాడ పారిశ్రామిక వాడ వ్యర్థాలు ఇలా చెప్పుకుంటూ పోతే గోదావరిని విషతుల్యంగా మారుస్తున్నవి ఎన్నో! ఫలితంగా ఇప్పటకే కొరింగా మడ అడవుల ఉనికి ప్రశార్థకంగా మారింది. చేపల జాతులు తగ్గుతున్నాయి. చిత్తడి నేలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. నది, సముద్ర సంగమ ప్రాంత జీవావరణ (ఎస్ట్యూరి ఎకాలజీ)సమతుల్యం దెబ్బతింటోంది.

కృష్ణా నదిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఉన్న హైదరాబాద్, విజయవాడ, పరిసర పట్టణాలు, పరిశ్రమలు, కృష్ణా నీటి నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) నివేదికలు పలుమార్లు హెచ్చరించాయి. మూసీ నది ద్వారా భారీ పరిమాణంలో మురుగు, పారిశ్రామిక వ్యర్థాలు కృష్ణాలో కలుస్తున్నాయి. అదే నీరు చివరకు కృష్ణాలో కలుస్తోంది. విజయవాడ, గుంటూరు వంటి నగరాలు తాగునీటి కోసం కృష్ణాపైనే ఆధారపడుతున్నాయి. ఇదే పరిస్థితి గోదావరి తీర పట్టణాల్లో కూడా ఉంది. రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు, కొవ్వూరు, నరసాపురం వంటి పట్టణాల ప్రజలు గోదావరి, దాని ఉప నదుల నీటినే తాగునీటి వనరుగా ఉపయోగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కలుషిత నీరు సరఫరా అయితే ప్రజల్లో చర్మవ్యాధులు, జీర్ణాశయ సమస్యలు, కలరా, టైఫాయిడ్, హెపటైటిస్, కిడ్నీ సమస్యలు, చివరకు క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉందని పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. అందువల్ల నదులను కాపాడటమన్నది కేవలం పర్యావరణ అంశం మాత్రమే కాదు. అది ప్రజారోగ్యం, ఆహార భద్రత, భవిష్యత్ ఆర్థిక వ్యవస్థ, జీవ వైవిధ్యం, తాగునీటి భద్రత మొదలైన వాటితో ముడిపడిన అత్యంత కీలకమైన అంశం.

?పవన్ కల్యాణ్ పర్యటన తరువాత ప్రధాన నదుల్లో కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, దీనిని గోదావరి నదికి, పుష్కరాలకు మాత్రమే పరిమితం చేసింది. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేవలం పుష్కరాలకొచ్చే యాత్రికుల కోసమే కాదు. నదుల తీర ప్రాంతంలో నివసించే కోట్లాదిమంది ప్రజానీకాన్ని దృష్టిలో ఉంచుకుని శాశ్వత చర్యలు చేపట్టాలి. వాటిలో భాగంగా మురుగుజలాలను నదుల్లో కలవకుండా, పూర్తి స్థాయి ట్రీట్ మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసి, ప్రత్యేక పైపు లైన్ల ద్వారా ఆ నీటిని ప్రజల తాగునీటేతర అవసరాలకు సరఫరా చేయాలి. కాలుష్యాలను నదుల్లోకి వదలకుండా పరిశ్రమలపై కఠిన పర్యవేక్షణ ఉంచాలి. ప్రమాదకర వ్యర్థాలను నదిలో కలపకుండా నియంత్రించాలి. అవసరమైన చోట ప్రత్యేక పర్యావరణ పరిరక్షణ జోన్లను ఏర్పాటు చేయాలి. మడ అడవుల పునరుద్ధరణ, చిత్తడి నేలలు, నది బఫర్ జోన్ల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి. అప్పుడే నదులు కేవలం నీటి వనరులుగా కాకుండా నిజమైన జీవనాడులుగా భావి తరాలకు అందుతాయి.

## మరోసారి పెరగనున్న ఎరువుల ధరలు




**అమరావతి, పతాకం న్యూస్:** ఖరీఫ్ ముంగిట ఎరువుల ధరలు అంతకంతకూ పైపైకి ఎగబాకుతూ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా కాంప్లెక్స్ ఎరువుల ధరలు మే నెలలో ఇప్పటికే రెండు తడవలు కంపెనీలు పెంచాయి. మరోసారి పెంచేందుకు ప్రతిపాదనలు రెడీ చేశాయి. మూడోసారి పెంచనున్న ధరలను కొన్ని కంపెనీలు ఇప్పటికే అమలులో పెట్టాయి. కాంప్లెక్స్ ఎరువులకు కేంద్రం పరిమితమైన సబ్సిడీలు ఇస్తుండటంతో యుద్ధం, రూపాయి విలువ పతనం, అంతర్జాతీయంగా ముడి సరుకుల ధరల పెరుగుదల, దేశంలో పెట్రోలు, డీజిల్ ఛార్జీల వడ్డింపు... వీటన్నింటినీ చూపించి ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయంటూ ఎరువుల కంపెనీలు ఇష్టానుసారం ధరలు పెంచుతున్నాయి. కంపెనీలు అడ్డు అదుపు లేకుండా పెంచుతున్న ధరలను కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ నియంత్రించకుండా చోద్యం చూస్తోంది. ఒక్క మే నెలలోనే కంపెనీలు ఒక్కో బస్తాపై విడతల వారీగా గరిష్టంగా రూ.800 నుంచి వెయ్యి వరకు పెంచాయి. అయినా మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. పాత ధరలపై తమ వద్ద ఉన్న ముడి సరుకులకు కంపెనీలు కొత్త రేట్లు (ఎంఆర్‌పి) పెట్టి రైతులకు అమ్ముతున్నాయి. పాత రేట్లపై తయారై ఉన్న ఎరువులకు కొత్త ఎంఆర్‌పిలు ముద్రించి విక్రయిస్తున్నారు. కంపెనీల ఒత్తిళ్లతో హోల్‌సేలర్లు, రిటైలర్లు తమ వద్ద ఉన్న పాత స్టాక్‌ను కొత్త రేట్లకు అమ్ముతున్నారు. ఈ వ్యవహారాలపై కేంద్రం కంపెనీల, అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడం లేదు. ఇటు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం (డబుల్ ఇంజిన్ సర్కార్) ఎరువుల వాడకాన్ని తగ్గించే పనిలో పడి ఎంఆర్‌పి అక్రమాలను పట్టించుకోవట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధారావాహిక మాదిరి ఎరువుల ధరల పెంపుపై ఆగ్రో ఇన్‌పుట్ డీలర్స్ అసోసియేషన్ (ఎఐడిఎ) కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రి జెపి నడ్డాకు శనివారం వినతిపత్రం అందజేసింది. వివిధ సాకులతో ఇష్టానుసారం ధరలు పెంచుతున్న కంపెనీలను నియంత్రించాలని కోరింది. యూరియాకు ప్రత్యామ్నాయంగా అమ్మోనియం సల్ఫేట్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలివ్వాలని, ఆ ఎరువు ధర తగ్గించాలని, రైతులకు అవగాహన కల్పించాలని సూచించింది.

## ప్లాస్టిక్ రహిత, సుందర నగర నిర్మాణమే లక్ష్యం




**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** గోదావరి నదిని కాలుష్యం బారిన పడకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' 'నా ఘాట్ -- నా బాధ్యత' సంయుక్త కార్యాచరణలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ నుంచి రివర్ ఫ్రంట్ వరకూ చేపట్టిన 'గ్రీన్ వాక్'ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదిద్దాం -- గోదావరిని కాపాడుకుందాం' అంటూ నినాదాలు చేశారు. ప్రతి దుకాణం వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. రాజమహేంద్రవరం లాంటి చారిత్రాత్మక నగరాన్ని ప్లాస్టిక్ బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయడం వల్ల డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోందని.. ముఖ్యంగా గోదావరిలో షాంపు కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు కలవడం వల్ల నదీ జలాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయని వివరించారు. నదీ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని దుకాణదారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియమ నిబంధనల దృష్ట్యా.. కవర్లు ఇవ్వబడవని దుకాణాల వద్ద బోర్డులు పెట్టవలసిందిగా కోరారు. అటువంటి దుకాణాలకు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ఒక సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

## డెల్టా కాల్వలకు జల కళ



**నిడదవోలు, పతాకం న్యూస్:** డెల్టా కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి ప్రజా ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద హెడ్ స్లూయిస్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి మాతకు పూలు, పండ్లు సమర్పించారు. అనంతరం స్లూయిజ్ గేట్లు ఎత్తే స్విచ్ ఆన్‌చేసి పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. అనంతరం గోదావరి మాతకు పసుపు, కుంకుమ, చీర, రవిక, పండ్లు సమర్పించారు. హెడ్ స్లూయిస్‌ను మామిడి తోరణాలతో, అరటి చెట్లతో అలంకరించారు. నీటిపారుదలశాఖ అధికారులు, నాయకు లు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గోదావరి జలాల ఖరీఫ్, రబీల ద్వారా ఏటా సుమారు రూ.5500 కోట్ల ఆర్థిక అభివృద్ధి సాధించడం జరుగుతుందని, ఇందుకు గోదావరి జలాలే ప్రధాన అధికారులు తెలియజేశారు. గోదావరి డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయడం ద్వారా సుమారు 5 లక్షల 30 వేల ఎకరాల ఆయకట్టు కు నీరు అందించడం జరగుతుందన్నారు.

## రొయ్య రైతులను వెంటాడుతున్న కష్టాలు..





**తూర్పు గోదావరి జిల్లా, పతాకం న్యూస్:** ఒకప్పుడు విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదిస్తూ 'డాలర్ల పంట'గా వెలిగిన ఆక్వా సాగును ప్రస్తుతం కష్టాల సుడిగుండం వెంటాడుతోంది. పెరిగిన మేత ధరలు, మార్కెట్ ఒడిదుడుకులతో ఇప్పటికే సతమతమవుతున్న ఆక్వా రైతులకు.. ప్రస్తుత భానుడి భగభగలు, అప్రకటిత విద్యుత్ కోతలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. కరెంట్ లేక, ఆక్సిజన్ అందక చెరువుల్లోనే రొయ్యలు కళ్లు తేలేస్తుండటంతో రైతాంగం కన్నీరు మున్నీరవుతోంది. వేసవిలో వైరస్ ముప్పు తక్కువగా ఉంటుందని భావించి పెట్టుబడులు పెట్టిన ఆక్వా రైతులకు జూన్ నెల గండంగా మారింది. ఎండ తీవ్రతకు తోడు రోజుకు మూడు నుంచి ఐదు గంటల పాటు విధిస్తున్న విద్యుత్ కోతలు రొయ్యల సాగును నిలువునా ముంచుతున్నాయి. ఆక్సిజన్ అందించే ఏరియేటర్లను నడపడానికి డీజిల్ కొనుగోలు చేయాల్సి రావడంతో గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది. పెట్టుబడి ఖర్చులకు తోడు ఈ ఖర్చులు మరింత భారమవుతున్నాయి. మే నెల ఆరంభంలో వేడి పెద్దగా లేకపోయినా రొయ్యల చెరువులలో 24 గంటలూ ఏరియేటర్లు తిప్పుతూ రొయ్యలకు ఆక్సిజన్‌తో పాటు చల్లదనం అందించారు. అయితే గత పది రోజులుగా ఎండతీవ్రత 45 డిగ్రీలకు తగ్గడం లేదు. ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతల దెబ్బకు రొయ్యలు ఎర్రగా మారిపోయి వైరస్ వచ్చిన రీతిలో చనిపోతున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో రొయ్యల ఎగుమతులలో అవాంతరాలు ఎదురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌పైనే ఆధారపడి ప్రస్తుతం కొనుగోళ్లు సాగుతుండడంతో ధరలు నేల చూపులు చూస్తున్నాయి. దీనికి తోడు సన్‌స్ట్రోక్ కారణంగా 60-40 కౌంట్ రొయ్యలు చనిపోతుండటంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 77,150 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. 30 నుంచి 40 కౌంట్ వరకూ రొయ్యలు అమెరికాకు, 50 నుంచి 100 కౌంట్ వరకు చైనా,యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం పెరిగిన ఖర్చుల నేపథ్యంలో ఎకరాకు రూ.ఐదు లక్షలు పెట్టుబడి వ్యయం అవుతుంది. పంట చేతికొచ్చే నాటికి సుమారు వంద రోజులు పడుతుంది. ప్రస్తుతం అత్యధిక పంట 60 నుంచి 70 రోజుల మధ్యలో ఉంది. రొయ్యలకు మేత, మందులు, ఆక్సిజన్ వంటి వాటిలో ఏది కొరత వచ్చినా వైరస్ సోకి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ఒక ఎకరాకు జనరేటర్ ద్వారా ఏరియేటర్‌లు ఆడిస్తే గంటకు లీటరు డీజిల్ ఖర్చవుతుంది. ప్రస్తుతం లీటరు డీజిల్ రూ.104 కాగా నిర్వహణ ఖర్చు మరో రూ.26 చొప్పున కనీసం రోజుకు నాలుగు గంటల చొప్పున లెక్కిస్తే రూ.520 ఖర్చు అవుతుంది. ఈ లెక్కన జిల్లాలో రోజుకు నాలుగు కోట్ల రూపాయల అదనపు భారం రైతులపై పడుతుంది.

## ఇంద్రకీలాద్రిపై యాత్రికుల రద్దీ



**విజయవాడ, పతాకం న్యూస్:** వేసవి సెలవులతోపాటు పౌర్ణమి కలిసి రావడంతో ఇంద్రకీలాద్రికి యాత్రికుల తాకిడి పెరిగింది. వేకువజాము నుంచే యాత్రికులు భారీగా తరలిరావడంతో సర్వదర్శనం క్యూలైన్, రూ 100, 300 తోపాటు అంతరాలయ దర్శనం క్యూలైన్లు యాత్రికులతో కిక్కిరిసిపోయాయి. యాత్రికులకు దుర్గమ్మ దర్శనం త్వరితగతిన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో ఇఒ సీనా నాయక్ స్వయంగా పర్యవేక్షించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల గిరి ప్రదక్షిణ జరిగింది. యాత్రికులు దుర్గగుడి ఘాట్ రోడ్డు కామదేనువు అమ్మవారి ఉపాలయం నుండి ప్రారంభమై కేఎల్‌రావు హెడ్ వాటర్ వర్క్స్, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, కబేళ మీదుగా పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, నెహ్రూ సెంటర్ మీదుగా మల్లికార్జునపేట నుంచి కనకదుర్గ నగర్ వరకూ ప్రదక్షణ చేపట్టారు. దుర్గమ్మను 55,917 మంది యాత్రికులు దర్శించుకున్నారు. సుమారు 4,05,982 రూపాయల ఆదాయం డిపాజిట్ల రూపంలో చేకూరింది. 1886 మంది తలనీలాలు సమర్పించారు. 10,233 మంది యాత్రికులు అన్న ప్రసాదాన్ని స్వీకరించిన్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. రూ.500 టికెట్ కొనుగోలు చేసిన యాత్రికులకు క్యూలైన్లలోనే అధికారులు లడ్డూలను అందజేస్తున్నారు.

## టిడ్కోకు రూ.273.79 కోట్లు విడుదల



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణం కోసం రూ.273.79 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ జిఓ నెంబరు 692 విడుదల చేశారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయడంతోపాటు బ్యాంకు లోన్లు, వడ్డీలు కట్టేందుకు ఈ నిధులు వినియోగించనున్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో హౌసింగ్ సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల కల్పన చేపట్టనున్నారు. దీనికోసం రూ.273 కోట్లకు పరిపాలనా పరమైన ఆమోదం తెలిపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## కలకలం రేపుతున్న తల్లీకూతుళ్ల మృతదేహాలు



**ఏలూరు, పతాకం న్యూస్:**ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నల్లమడు గ్రామ శివారులో తల్లీకూతుళ్ల మృతదేహాలు కలకలం రేపాయి. సోమవారం ఉదయం దూబచర్ల-చేబ్రోలు మార్గంలోని జీడిమామిడి తోటలో రెండు మృతదేహాలను గుర్తించిన స్థానికులు.. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన మద్ద వెంకటలక్ష్మి (46), గంటా ఆంతూ భాయ్ (60) తల్లీకూతుళ్లుగా గుర్తించారు. ఘటనా స్థలికి చేరుకున్న చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో ఒకరి తలకు బలమైన గాయమైనట్లు తెలుస్తోంది. ఇది హత్యేనా ? ఇంకేమైనా కారణాలున్నాయా ? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

## గోదావరి డెల్టాకు నీటి విడుదల



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి ఖరీఫ్ సీజన్ సాగునీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ముందుగానే నాట్లు వేసుకొని పంటలను రక్షించుకోవాలని రైతులకు సూచించారు. ముందస్తు నీటి విడుదలతో త్వరగా పంట చేతికి వస్తోందని, దీంతో నష్టాల బారి నుంచి రైతు గక్కవచ్చాన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతులకు మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ?రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ... రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే సిద్ధాంతంతో సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. అమలాపురం ఎంపి గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ... కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించి రైతులకు మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరల శెట్టి సునీల్ కుమార్, వెస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీ కృష్ణ రాజు, ఇరిగేషన్ అధికారులు చీఫ్ ఇంజనీర్ చినబాబు, ధవళేశ్వరం ఎస్ఇ జి. శ్రీనివాస్ రావు, హెడ్ వర్క్స్ ఎస్ఇ శ్రీనివాస్, ఇఇ రామకృష్ణ, విజ్జేశ్వరం ఇఇ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం



**నంద్యాల, పతాకం న్యూస్:** నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహం తల భాగాన్ని ఓ వ్యక్తి తొలగించి చేతితో పట్టుకుపోవడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడు నంద్యాల టౌన్ బైటిపేటకు చెందిన చాకలి జంబులయ్యగా గుర్తించామని తెలిపారు. ఇతని మానసిక పరిస్థితి సరిగా లేదని, 15 ఏళ్లుగా చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. తన చిన్న కూతురు స్వాతి (20) కూడా మానసిక వ్యాధితో బాధపడుతూ ఈ ఏడాదిలో మరణించారని చెప్పారు. దీని వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైఎస్ఆర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన విషయం తెలుసుకున్న వైసిపి శ్రేణులు శ్రీనివాస సెంటర్ కు చేరుకొని ఆందోళనకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైఎస్ఆర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విగ్రహన్ని ధ్వంసం చేయడానికి గల కారణాలను వెలికితీయాలని, సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన వెనుక ఉన్న ప్రభావిత శక్తులను గుర్తించి బయటపెట్టాలని ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులు అత్యంత దారుణమని, వాటిని కూటమి ప్రభుత్వం చూస్తూ ఉండటం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ ఘటన ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపునకు నిదర్శనమని ఆరోపించారు. పట్టపగలు ఓ వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేస్తుండగా పోలీసులు అక్కడే ఉండి కూడా అడ్డుకోకపోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. నిందితుడి మానసిక స్థితి బాగోలేదని, సంయమనం పాటించాలని సూచించడం పోలీసు యంత్రాంగానికి తగదని వ్యాఖ్యానించారు. ధ్వంసమైన విగ్రహం స్థానంలో వెంటనే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

# థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి..!



శరీరంలోని జీవక్రియలను నియంత్రించే ముఖ్యమైన ఎండోక్రైన్ గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. ఈ గ్రంథి సక్రమంగా పనిచేయకపోతే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దేశంలో థైరాయిడ్ సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అందుకే థైరాయిడ్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సరైన ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ గ్రంథికి సంబంధించిన వ్యాధులు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. థైరాయిడ్ హార్మోన్లు తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల హైపోథైరాయిడిజం వస్తుంది. ఇది మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. మరోవైపు, థైరాయిడ్ హార్మోన్లు అధికంగా ఉత్పత్తి అయితే హైపర్ థైరాయిడిజం ఏర్పడుతుంది. ఈ రెండు పరిస్థితులపై కూడా ఆహారపు అలవాట్లు గణనీయమైన ప్రభావం చూపుతాయి. హైపోథైరాయిడిజం ఉన్నవారు మెడిటరేనియన్ డైట్‌ను అనుసరించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహార విధానంలో పండ్లు, కూరగాయలు, బ్రౌన్ రైస్, ఓట్స్, బార్లీ, సంపూర్ణ గోధుమలు, గింజలు, నట్స్, ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు, అలాగే బీన్స్, చేపలు, కోడి మాంసం, పెరుగు, చీజ్ వంటి ప్రోటీన్ ఆహారాలు ఉంటాయి. ఈ డైట్‌లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు థైరాయిడ్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అలాగే ప్రాసెస్ చేయని సహజ ఆహారాలతో కూడిన పాలియో డైట్ కూడా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే బ్రోకోలీ, కాలీఫ్లవర్, ముల్లంగి, క్యాబేజీ వంటి క్రూసిఫెరస్ కూరగాయలను పచ్చిగా ఎక్కువగా తినడం వల్ల థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

థైరాయిడ్ హార్మోన్ల తయారీలో అయోడిన్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. అయోడిన్ లోపం హైపోథైరాయిడిజానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తారు. అయోడైజ్డ్ ఉప్పు వాడని వారు, పూర్తిగా వెగన్ ఆహారం తీసుకునేవారు, గర్భిణులు అయోడిన్ లోపానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది. సముద్రపు శైవలాలు, సముద్ర ఆహారం, పాల ఉత్పత్తులు, గుడ్లు కూడా అయోడిన్‌కు మంచి వనరులు. అయితే హాషిమోటో థైరాయిడిటిస్ వంటి ఆటోఇమ్యూన్ థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు అధికంగా అయోడిన్ తీసుకోవడం వల్ల సమస్యలు పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్త అవసరం. సెలీనియం అనే ఖనిజం థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడటంతో పాటు గ్రంథిని ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి రక్షిస్తుంది. ట్యూనా చేప, గుడ్లు, బ్రెజిల్ నట్స్, పప్పుధాన్యాలు, సార్డిన్ చేపలు, ఓట్స్ వంటి ఆహారాల్లో సెలీనియం లభిస్తుంది. అయితే అధికంగా సెలీనియం తీసుకోవడం వల్ల విషపూరిత ప్రభావాలు కలిగే ప్రమాదం ఉంటుంది.

జింక్ లోపం కూడా థైరాయిడ్ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుంది. గుమ్మడికాయ గింజలు, ఆయిస్టర్‌లు, నట్స్, పప్పుధాన్యాలు జింక్‌కు మంచి వనరులు. అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో జింక్ తీసుకోవడం వల్ల దుష్ప్రభావాలు తలెత్తే అవకాశం ఉంటుంది.

విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్, మెగ్నీషియం లోపాలు కూడా హైపోథైరాయిడిజం ప్రమాదాన్ని పెంచుతాయి. సూర్యరశ్మి, కొవ్వు అధికంగా ఉండే చేపలు, గుడ్డు పచ్చసొన, పాల ఉత్పత్తులు విటమిన్ డికి మంచి వనరులు. విటమిన్ బి12 ప్రధానంగా జంతు ఆధారిత ఆహారాల్లో లభిస్తుంది. గుమ్మడికాయ గింజలు, అవిసె గింజలు, చియా గింజలు, బాదం, జీడిపప్పు, ఆకుకూరలు, అరటిపండ్లు, పెరుగు వంటి ఆహారాల్లో మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది. పాలకూర, ఫోర్టిఫైడ్ సిరియల్స్, సముద్ర ఆహారం, శనగలు, టోఫూ వంటి ఆహారాల్లో ఐరన్ లభిస్తుంది. ఐరన్ అధికంగా ఉన్న ఆహారాలతోపాటు నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు తీసుకుంటే శరీరం ఐరన్‌ను మరింత సమర్థంగా గ్రహిస్తుంది.

థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ముఖ్యంగా అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలను తగ్గించడం మంచిది. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే అవకాశం ఉంది. హైపర్ థైరాయిడిజం ఉన్నవారు అధిక అయోడిన్, కెఫిన్, సోయా ఉత్పత్తులు, గ్లూటెన్ ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితం చేయాలి. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, ఒత్తిడిని తగ్గించే పద్ధతులు, తగినంత నిద్ర, ఆరోగ్య పరీక్షలు, అనారోగ్యకరమైన ఆహారాలకు దూరంగా ఉండటం ద్వారా థైరాయిడ్ ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు.

## చింతపల్లి, జీకే వీధి మండలాల్లోని గిరిజనులకు

# కరెంట్ కష్టాలు తీరేదెన్నడో?



**చింతపల్లి, పతాకం న్యూస్:** చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ఉన్న 650 గిరిజన గ్రామాలకు బలిఘట్టం 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతున్నది. బలిఘట్టంలో ఏ సాంకేతిక సమస్య వచ్చినా చింతపల్లి, జీకేవీధి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఆ సమస్య పరిష్కరించే వరకు రెండు మండలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. దీంతో ఆదివాసీలు అంధకారంలో జీవించాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. ప్రధానంగా వర్షాకాలంలో ఈ సమస్యను గిరిజనులు అధికంగా ఎదుర్కొంటున్నారు. వర్షాలతో చెట్లు కొమ్మలు విరిగిపడడం, పిడుగులు పడి ఇన్సులేటర్లు పగిలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సమస్యలతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం జరుగుతుంది. విద్యుత్ శాఖ సిబ్బంది ఈ సమస్యను పరిష్కరించే వరకు చింతపల్లి, జీకేవీధి మండలాలు చీకటిలో ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీలేరు నుంచి ప్రత్యామ్నాయ 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చింతపల్లి నుంచి దుప్పిలవాడ వరకు ఇప్పటికే 33 కేవీ విద్యుత్ లైన్ ఉంది. సీలేరు నుంచి దుప్పిలవాడ వరకు తొమ్మిది కిలోమీటర్లు విద్యుత్ లైన్ నిర్మాణం చేపడితే సరిపోతుంది. ఈ మేరకు 2024 సెప్టెంబరు 8వ తేదీన కురిసిన అధిక వర్షాల సమయంలో ఈ ప్రాంతాన్ని సందర్శించిన ఈపీడీసీఎల్ సీఎండీ సీలేరు నుంచి ప్రత్యామ్నాయంగా చింతపల్లికి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోద ముద్ర వేశారు. ఇందుకు రూ.ఏడు కోట్లను ప్రభుత్వం 2024 నవంబరులో విడుదల చేసింది.

సీలేరు నుంచి దుప్పిలవాడ వరకు 33 కేవీ విద్యుత్‌లైన్ రిజర్వ్‌డ్ ఫారెస్టులో వేయాల్సి ఉంది. సుమారు 20 ఏళ్ల క్రితం సీలేరు నుంచి దుప్పిలవాడ వరకు విద్యుత్‌లైన్ నిర్మించారు. అయితే వినియోగించకపోవడంతో ఈ లైన్ పాడైపోయింది. అప్పట్లో విద్యుత్ లైన్ నిర్మాణానికి ఈపీడీసీఎల్ అధికారులు అటవీ శాఖ అనుమతులు తీసుకున్నారు. తాజాగా నూతన విద్యుత్ లైన్ నిర్మాణానికి పాత అనుమతులను పునర్ పరిశీలించి కొత్త అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. ఇందుకోసం చింతపల్లి అటవీ శాఖ అధికారులు సర్వే నిర్వహించి, అమరావతి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుకి ప్రతిపాదనలు 2024 నవంబరు ఆఖరిలో పంపించారు. ప్రతిపాదనలు పంపించి ఏడాదిన్నర గడిచినా అటవీ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్‌కి అనుమతులు మంజూరు చేయలేదు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయమై అటవీ శాఖ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్‌కి అవసరమైన నిధులు విడుదల చేసినప్పటికీ పనులు ప్రారంభించే పరిస్థితి లేక ఆదివాసీలకు విద్యుత్ కష్టాలు తీరడంలేదు.

## వర్షాభావంపై రైతులకు అవగాహన కల్పించాలి: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సెక్రటేరియట్‌లో సమీక్ష జరిగింది. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బహిష్కరించిన టీఎంసీ

**కోల్‌కతా, పతాకం న్యూస్:** మమతాబెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ సోమవారంనాడు ఇద్దరు ఎమ్మెల్యేలపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. పార్టీ ఎమ్మెల్యేలు సందీపన్ సహా, రితబ్రత బెనర్జీలను పార్టీ నుంచి బహిష్కరించింది. వారి పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు ప్రకటించింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలకు భిన్నంగా ఇద్దరు ఎమ్మెల్యేలు కార్యక్రమాలు సాగిస్తుండటం, ప్రకటనలు ఇస్తుండటంతో వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని ఏఐటీసీ క్రమశిక్షణా సంఘం నిర్ణయం తీసుకుందన్నారు.




## ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ ఆదాయం ఎంతో తెలుసా?



ఐపీఎల్ 2026లో బ్యాట్‌తో విధ్వంసం సృష్టించిన 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ.. అరుదైన రికార్డులు కొల్లగొట్టి పలు అవార్డులు అందుకున్నాడు. ఈ సీజన్‌లో 776 పరుగులు చేసి.. ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకున్నాడు. 59 సిక్సర్ల క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా ఏకంగా ఒకే సీజన్‌లో 72 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. మరి ఈ కుర్రాడు ఐపీఎల్ 2026లో ఎంత డబ్బును సంపాదించాడో తెలుసా..? వైభవ్ సూర్యవంశీని ఐపీఎల్ 2025 వేలంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రూ.1.10కోట్లకు కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లోనూ అదే మొత్తానికి రిటైన్ చేసుకుంది. ఈ డబ్బుతో పాటు వైభవ్ మ్యాచ్ ఫీజులు, పలు రివార్డులూ అందుకున్నాడు. మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా రూ.15 లక్షలు, టోర్నమెంట్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నందుకు రూ.10 లక్షలు, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచినందుకు రూ.10లక్షలతో పాటు టాటా సియెరా కారు, సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచినందుకు రూ.10 లక్షలు, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నందుకు రూ.10 లక్షలు అందుకున్నాడు. కేవలం ఈ అవార్డుల ద్వారానే వైభవ్ రూ.55లక్షల నగదు బహుమతిగా అందుకున్నాడు. ఇక బీసీసీఐ అమలు చేసే మ్యాచ్ ఫీజు విధానం ప్రకారం, ప్రతి మ్యాచ్‌కు రూ.7.5 లక్షల చొప్పున ఆటగాళ్లకు చెల్లిస్తారు. వైభవ్ ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌లు ఆడటంతో మ్యాచ్ ఫీజుల రూపంలోనే రూ.1.20 కోట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. దీనికి తోడు పలుమార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ఎలక్ట్రిక్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్', 'మోస్ట్ సిక్సెస్ ఆఫ్ ది మ్యాచ్' వంటి అవార్డులను కూడా గెలుచుకున్నాడు. ఒక్కో అవార్డుకు రూ.1 లక్ష చొప్పున నగదు బహుమతి లభించింది. అన్నీ కలిపి చూస్తే, రిటైనర్ ఫీజు రూ.1.10 కోట్లు, మ్యాచ్ ఫీజులు రూ.1.20 కోట్లు, సీజన్ అవార్డుల ద్వారా రూ.55 లక్షలు, ఇతర మ్యాచ్ అవార్డుల నగదు బహుమతులతో కలిసి వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026లో రూ.2.85 కోట్లకు పైగా ఆదాయం పొందినట్లు తెలుస్తోంది.

# బెంగళూరుదే ఐపీఎల్ ట్రోఫీ



ఐపీఎల్-19వ సీజన్‌లోనూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఏకపక్ష ఫైనల్లో ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. విరాట్ కోహ్లి (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 75 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆర్‌సీబీకిది వరుసగా రెండో టైటిల్ కాగా.. అటు 2022లో తొలిసారి విజేతగా నిలిచిన గుజరాత్ ఫైనల్లో ఓడడం ఇది రెండోసారి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. సుందర్ (37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్), నిశాంత్ (18 బంతుల్లో 3 ఫోర్లతో 20), బట్లర్ (23 బంతుల్లో 1 ఫోర్‌తో 19) మాత్రమే రాణించారు. రసిఖ్‌కు మూడు.. భువనేశ్వర్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 18 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), డేవిడ్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) వేగం చూపారు. రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా విరాట్ కోహ్లి, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా వైభవ్ సూర్యవంశీ నిలిచారు. స్వల్ప ఛేదనను ఆర్‌సీబీ మెరుపు వేగంతో ఆరంభించింది. ఓపెనర్ విరాట్ కోహ్లి కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మధ్య ఓవర్లలో వేగంగా వికెట్లు కోల్పోయినా తను మాత్రం చివరి వరకు ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. అలాగే లక్ష్యం తక్కువే కావడంతో ఆర్‌సీబీకి కూడా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. తొలి ఓవర్‌లో సిరాజ్ ఐదు పరుగులే ఇచ్చినా ఆ తర్వాత ఆర్‌సీబీ దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ 4,6,4,4తో 18 రన్స్.. నాలుగో ఓవర్‌లో విరాట్ 4,4,6,4తో 19 రన్స్ రాబట్టడంతో జట్టు స్కోరు 4 ఓవర్లలోనే 55 పరుగులకు చేరింది. అయితే జోరు మీదున్న అయ్యర్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 27 బంతుల్లో 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు దేవ్‌దత్ (1)ను రబాడ పెవిలియన్‌కు చేర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 70/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఆ తర్వాత పరుగుల జోరు నెమ్మదించింది. దీనికి తోడు స్పిన్నర్ రషీద్ 9వ ఓవర్‌లో రజత్ (15), క్రునాల్ (1) వికెట్లు తీయడంతో గుజరాత్‌లో జోష్ కనిపించింది. కానీ విరాట్ నిలకడగా క్రీజులో నిలిచాడు. అడపాదడపా బౌండరీలతో జట్టును విజయం దిశగా నడిపించాడు. అలాగే ఓ ఫోర్‌తో 25 బంతుల్లోనే తన ఐపీఎల్ కెరీర్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీని పూర్తి చేశాడు. టిమ్ డేవిడ్ ఉన్న కాసేపు వేగంగా ఆడి 14వ ఓవర్‌లో వెనుదిరిగాడు. అప్పటికి ఆరు ఓవర్లలో 24 పరుగులే అవసరం కావడంతో మ్యాచ్ ఫలితమేమిటో తెలిసిపోయింది. 16వ ఓవర్‌లో విరాట్ క్యాచ్‌ను గిల్ అందుకున్నా.. డైవింగ్ సమయంలో బంతి నేలకు తాకడంతో నాటౌట్‌గా ప్రకటించారు. ఆ తర్వాత జితేశ్ (11 నాటౌట్) సహాయంతో విరాట్ 4,6తో మరో 12 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ పరుగుల కోసం అల్లాడింది. అటు ఆర్‌సీబీ బౌలర్లు బౌన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ వికెట్ల వేట సాగించగా.. టైటాన్స్ పూర్తి ఒత్తిడిలో పడింది. ఏ ఒక్క బ్యాటరూ క్రీజులో నిలిచే ప్రయత్నం చేయలేదు. ఈ కీలక మ్యాచ్‌లోనూ మిడిలార్డర్ ఆకట్టుకోలేకపోయింది. వాషింగ్టన్ సుందర్ మాత్రమే ఆఖరి వరకు పోరాడి గౌరవప్రదమైన స్కోరందించాడు. ఇక సకట?స్సఫుల్ ఓపెనర్లుగా పేరు తెచ్చుకున్న గిల్ (10), సుదర్శన్ (12) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరడంతో టైటాన్స్ ఆట ఒక్కసారిగా గతి తప్పింది. బౌలర్లు కట్టడి చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 45/2 స్కోరు మాత్రమే చేయగలిగింది. యువ బ్యాటర్ నిశాంత్ మూడు ఫోర్లతో ఆకట్టుకున్నా ఎనిమిదో ఓవర్‌లో రసిఖ్ అతడిని అవుట్ చేశాడు. అయితే క్రీజులో వెటరన్ బట్లర్-సుందర్ ఉండడంతో టైటాన్స్ ఆశలు వదులుకోలేదు.




# నిజాయతీగా తీసే సినిమాలకు ఆదరణ : జాన్వీ కపూర్



సినిమా చూసే ప్రేక్షకులు దేవుళ్లతో సమానమని త్వరలో విడుదల కానున్న 'పెద్ది' సినిమా హీరోయిన్ జాన్వీ కపూర్ అభిప్రాయపడింది. సినిమా తీయడం వారికి చేసే ఓ గొప్ప సేవ అని వ్యాఖ్యానించింది. వారి అభిప్రాయాలే నటీనటులను మరింత రాటుదేలేలా చేస్తాయని తెలిపింది. ప్రేక్షకులను అలరించడానికే తాము నిరంతరం శ్రమిస్తామని జాన్వీ పేర్కొంది. సోషల్ మీడియాలో కొందరు సినిమా చూడకుండానే పెదవి విరుస్తుంటారని, అయినా వారి అభిప్రాయాలను తాము పూర్తిగా కొట్టిపారేయలేమని చెప్పింది. ప్రేక్షకుల అభిప్రాయాలు ఎంత కఠినంగా ఉన్నా.. అవి తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి ఎంతో సాయపడతాయని వివరించింది.

మంచి ఉద్దేశంతో పూర్తి హార్డ్ వర్క్‌తో, నిజాయతీగా తీసే ఏ సినిమా అయినా కచ్చితంగా ప్రేక్షకులకు చేరుతుందని జాన్వీ ధీమా వ్యక్తం చేసింది. జనం తొందరగా ఒక అంచనాకు వచ్చేసినప్పటికీ సినిమాలో దమ్ముంటే ఆదరిస్తారని చెప్పింది. ప్రేక్షకులు ఇచ్చే ప్రతి ఫీడ్‌బ్యాక్‌ను మనస్ఫూర్తిగా స్వీకరిస్తానని స్పష్టం చేసింది.

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా వస్తున్న 'పెద్ది' సినిమాలో జాన్వీ నటించిన విషయం తెలిసిందే. ఈ భారీ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో శివరాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతిబాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్‌లో ఇటీవల వరుణ్ ధావన్‌తో కలిసి 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారీ' సినిమాలో మెరిసిన ఈ భామ 'పెద్ది' ఎంతో నమ్మకంతో ఉంది.

# 'సేవ్ ది టైగర్స్ 3' ట్రైలర్ విడుదల..



తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' మూడో సీజన్‌తో మళ్లీ వచ్చేస్తోంది. ఇప్పటికే రెండు సీజన్లు బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, భార్యాబాధితుల కథకు విశేష ఆదరణ తెచ్చిపెట్టాయి. తాజాగా, ఈ సిరీస్ మూడో సీజన్‌కు సంబంధించిన వినోదభరితమైన ట్రైలర్‌ను విడుదల చేశారు. జూన్ 19 నుంచి ఈ సిరీస్ డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా ఉంది. "పెళ్లి గురించి మనకు చిన్నప్పటి నుంచి అబద్ధాలే చెప్పారు" అంటూ అభినవ్ గోమటం చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. పెళ్లిళ్లపై తమ గోడు వెళ్లబోసుకుంటున్న ముగ్గురు స్నేహితులు ఘంటా రవి (ప్రియదర్శి), రాహుల్ (అభినవ్ గోమటం), విక్రమ్ (చైతన్య కృష్ణ) సంభాషణలతో కథనం సరదాగా సాగుతుంది. "మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న వాడు నాకు దొరికితేనా" అని విక్రమ్ అనగానే, స్వర్గంలో ఇంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్

ప్రత్యక్షమ వడంతో కథ ఫాంటసీ మలుపు తీసుకుంటుంది. ఆ తర్వాత, ముగ్గురు స్నేహితుల జీవితాలు అనూహ్యంగా మారిపోతాయి.

ఘంటా రవి ఎమ్మెల్యేగా, రాహుల్ గొప్ప రచయితగా, విక్రమ్ ఓ పెద్ద కంపెనీకి సీఈవోగా కనిపిస్తారు. ఇది నిజమా లేక మరో ప్రపంచంలో జరుగుతోందా అనే గందరగోళం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈసారి ఫాంటసీ అంశాలను జోడించి వినోదాన్ని నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లినట్టు స్పష్టమవుతోంది. ప్రియదర్శి, అభినవ్, చైతన్య కృష్ణతో పాటు పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మ తమ పాత్రలతో మరోసారి అలరించడానికి సిద్ధమయ్యారు. మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం క్రియేటర్లుగా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు శ్రీరామ్ ఎరగం దర్శకత్వం వహించారు. ట్రైలర్ చూస్తే కామెడీకి మాత్రం లోటు ఉండదని భరోసా ఇస్తోంది.






# విజయ్‌పై నటి జూలీ సంచలన ఆరోపణలు!



ప్రముఖ తమిళ టెలివిజన్ నటి, బిగ్ బాస్ ఫేమ్ జూలీ... తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తన గర్భస్రావానికి సీఎం విజయ్ పరోక్షంగా కారణమంటూ ఆమె వ్యాఖ్యానించారు. జల్లికట్టు ఉద్యమం ద్వారా వెలుగులోకి వచ్చిన జూలీ, ఇటీవల ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ కార్యకర్తలు, ఆయన అభిమానులు సోషల్ మీడియాలో తనపై నిరంతరాయంగా చేసిన ట్రోలింగ్, వేధింపుల వల్లే తాను తీవ్ర మానసిక క్షోభకు గురయ్యానని, తద్వారా తన కడుపులోని బిడ్డను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "నా బిడ్డను కోల్పోవడానికి విజయ్ అన్నే బాధ్యుడు. ఆయన నేరుగా ఈ పని చేయకపోయినా.. తన అభిమానులను ఆపమని ఒక్క మాట చెప్పి ఉంటే నేను బిడ్డను కోల్పోయేదాన్ని కాదు" అని జూలి ఆరోపించారు.

గత ఎన్నికల సమయంలో విజయ్ రాజకీయ విధానాలపై విమర్శలు చేయడం, మెరీనా బీచ్ వద్ద నిరసన తెలపడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారని జూలీ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ దారుణమైన కామెంట్లు పెట్టారని, చివరకు తనపై రూ. 15 లక్షల విలువైన నకిలీ కిడ్నీ స్కామ్ ఆరోపణలు కూడా సృష్టించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజలు విజయ్ అన్న ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సీఎం అయ్యారని అంటున్నారు.

జూలీ చేసిన ఈ ఆరోపణలను ముఖ్యమంత్రి విజయ్ మద్దతుదారులు, టీవీకే నేతలు, కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తున్నారు. కేవలం పబ్లిసిటీ కోసమే ఆమె ఇలాంటి అవాస్తవాలు మాట్లాడుతోందని మండిపడుతున్నారు. కాగా, ఆన్‌లైన్ వేధింపులపై జూలీ ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ వ్యవహారంపై సీఎం విజయ్ లేదా టీవీకే పార్టీ అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి స్పందన తెలియజేయలేదు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**